honeybee.org

మే-జూన్ 2016

# పల్లెసృజన

సంపుటి 4 సంచిక 6

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org




# 50వ సంచిక

# నీరు ఎవరికి చెందుతుంది?



ఓసారి గడ్డి మైదానాలలో నివసించే ఒక తోడేలు వేటకని బయలుదేరింది. అక్కడ దానికొక చనిపోయిన జింక కనిపించింది. జింక పక్కటెముకకి చాలా విలువుంది. దానిని ఆభరణంగానే కాక, డబ్బుగా కూడా వాడేవారు. తోడేలు దానిని తీసుకుని నీళ్ళని సంరక్షించే కప్ప మనుషుల దగ్గరికి వెళ్ళింది. ఎవరికైతే తాగడానికి, వండుకోవటానికి, చివరకి కడుక్కోవడానికి కూడా నీళ్ళ కావాలో వాళ్ళు కప్ప మనుషుల దగ్గరినుంచి తెచ్చుకోవాల్సిందే. తోడేలు వారిదగ్గరికి వెళ్ళి ఇదిగో నావద్ద విలువైన ఎముక వుంది. దీనిని తీసుకొని నన్ను నీళ్ళు త్రాగనివ్వండి. ఇదిగో నేను చాలాసేపు నీళ్ళు తాగుతా బాగా దాహంగా వుంది అన్నది. దానికి అవి ముందా ఎముక ఇచ్చి తర్వాత నీకు కావలసినన్ని నీళ్ళు త్రాగు అన్నాయి. తోడేలు వారికా ఎముక ఇచ్చి చూడండి నేను చాలాసేపు త్రాగుతాను కాబట్టి నా తల చాలాసేపు క్రిందకే వుంటుంది. చాలా దాహంగా వుంది, మరేం అనుకోకండి, అసలు నన్ను పట్టించుకోకండి అన్నది. దానికి సరేనన్నారు కప్ప మనుషులు. నీళ్ళు ఒక ఆనకట్ట వెనక నిలువ చేయబడి వుంటాయి. అక్కడ తోడేలు చాలాసేపు నీళ్ళు త్రాగింది. చివరికి కప్ప మనుషుల్లో ఒకరికి అనుమానం వేసి ఏమిటి చాలా నీళ్ళు త్రాగుతున్నావు అన్నాడు. తోడేలు తలపైకెత్తి చెప్పాగా చాలా దాహంగా వుందని అనేసి మళ్ళీ తలొంచుకొని నీళ్ళు త్రాగసాగింది. కొంతసేపటికి మరొకరు ఓ తోడేలా నువ్వు చాలా నీళ్ళు తాగుతున్నావు, ఇలాగైతే నీవు ఇంకొక ఎముక ఇవ్వాల్సి వుంటుంది అన్నాడు. దానికి తోడేలు ముందు నన్ను నీళ్ళు త్రాగనివ్వండి అనేసి తల నీటిలో ముంచేసింది. కప్ప మనుషులకి తోడేలు వరసేం నచ్చలేదు.

ఇంతసేపు తోడేలు నీటి అడుగున ఆనకట్ట లోపల్నుంచి ఒక బొర్ర తవ్వుతోంది. అది పూర్తయ్యాక తోడేలు పైకొచ్చి హమ్మయ్య నా దాహం తీరింది అన్నది. అప్పుడే ఆనకట్ట పగిలి నీరంతా బయటికి వచ్చి పల్లపు ప్రాంతానికి ప్రవహించి, నదులు, జలపాతాలుగా మారిపోయింది.

కప్ప మనుషులు ఏయ్ మా నీరంతా దొంగిలించావు అన్నాయి. దానికి తోడేలు ఒకరి ఆధీనంలోనే నీరంతా ఉండటం సరికాదు. ఇప్పుడు ఎవరికి కావాలంటే వారికి అందుబాటులోకి వచ్చింది నీరు అనిచెప్పి పారిపోయింది. తోడేలు సరైన పనే చేసిందా?

– హనీబీ 10(4) – 1999

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 6 మార్చి - ఏప్రిల్ 2016

## ఈ సంచికలో...


- యువరైతులకు ఆదర్శం రాజిరెడ్డి వ్యవసాయం - 3
- ఎడిటర్ శశిమోహన్ 'మనసులో మాట' - 7
- అధిక దిగుబడినిచ్చే 'కంది' విత్తనాలు - రిచా-2000 రకం - 10
- 'పల్లెసృజన' పరిచయం నా భాగ్యం-కరీం - 11
- 18వ చిన్న శోధయాత్ర - 12
- ఒక భారతీయ సగటు రైతు కథ - ధారావాహికం - 14
- 8వ ద్వైవార్షిక పోటీలు (ధారావాహికం) - 18
- 34వ జాతీయ శోధయాత్ర - 24
- 'పల్లెసృజన'కు సర్వదా కృతజ్ఞులం - సుభాని సోదరులు - 30
- స్పందన - 32

కవర్ లోపలి పేజీల్లో ....

అందరికీ తగినంత లేదా-హనీబీ కథ,

రైతుల కరకు రైతులు తయారు సేంద్రియ పురుగు మందులు

మధ్య పేజీ :

ఎన్.ఐ.ఎఫ్. బహుమతి పొందిన చిన్నారుల చిలిపి జ్ఞానం

ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు



### సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్ సిద్ధు



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
president@pallesrujana.org

Visit at :
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com


## HoneyBee Regional Collaborators & Publications


**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# సేంద్రియ వ్యవసాయం ఎవరికోసం?

ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కొన్ని వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, ముఖ్యంగా విశ్రాంత వ్యవసాయ సైంటిస్టులు, రైతు సంఘాలు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. రైతుల అవగాహనకు వారి చేయూతకు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాయి. సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు పట్టణాలలో ఎంతోమంది వ్యాపారస్తులు మార్కెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. వినూత్నంగా ఈ మార్కెట్లు ఇంటర్‌నెట్ ద్వారా ప్రారంభమైనాయి. గత రెండు సంవత్సరాలలో సేంద్రియంగా పండించిన పదార్థాలకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. ఐశ్వర్యవంతులు సేంద్రియ పదార్థాలపై మక్కువ చూపటం వల్ల సూపర్ మార్కెట్‌లలో పెద్దపెద్ద మాల్స్‌లో వీటిని అమ్మడం ప్రారంభించారు. సేంద్రియంగా పండించిన కూరగాయలు, పండ్లు, పప్పుదినుసులు, బియ్యం, నూనెలకు ఈవిధంగా మంచి డిమాండ్ లభిస్తోంది. భవిష్యత్‌లో ఈ క్రమం ఇలాగే ఉంటుందని, ఇంకా వృద్ధిలోకి వస్తుందని భావిస్తున్నాము.

అయితే సేంద్రియం అనగానే ధర చాలా ఎక్కువగా ఉంటుంది, సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. సేంద్రియ పదార్థాలు ఆరోగ్యమని అందరికీ తెలుసు. కాని, అవి ధనవంతులకు మాత్రమే అందుబాటులో వున్నాయి కాబట్టి 80 శాతం ప్రజలు వాటిని కొనలేరు, తినలేరు. ఈవిధంగా సమాజంలోని మెజారిటీ ప్రజలకు ఆరోగ్యకర భోజనం తినే అవకాశం లేకుండా పోతోంది. దీనికి కారణమెవరు? సేంద్రియ పద్ధతులలో వ్యవసాయం చేయాలని, అందరి ఆరోగ్యాలు బాగుపడాలని కొండెక్కి అరుస్తున్న వారందరు జరుగుతున్న ఈ అసమానతల గురించి మాట్లాడరేం? మార్కెట్ నిర్ణయించిన రేట్లకు కొనడం తప్ప అంతగా ధరను నిర్ణయించడంలో వినియోగదారులకు అన్యాయం జరుగుతుందన్న సత్యాన్ని గ్రహించరేం?

రైతన్నకు సేంద్రియ వ్యవసాయం వల్ల అధిక లాభాలు వస్తున్నాయా? మార్కెట్‌లో కొనేవాళ్ళు మామూలు ధరకే రైతులవద్ద కొంటున్నారు. కాని వినియోగదారులకు మాత్రం 3 నుంచి 5 రెట్లు ధర పెంచి అమ్ముతున్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు అధిక లాభాలు వస్తాయని మభ్యపెడుతున్నారు. ప్రస్తుత సేంద్రియ మార్కెట్ ఇటు రైతులకు కాని, అటు వినియోగదారులకు గాని లాభం చెయ్యటం లేదు. ఈ రెండు వర్గాలపై మార్కెట్‌కు ఎలాంటి ప్రేమ, గౌరవం లేవు. ఈ రెండు వర్గాల వల్లే మార్కెట్‌కు అస్తిత్వం ఉందన్న విషయం కూడా మరిచి వీరిని నష్టాలపాలు చేస్తున్నారు. ఇలాంటి మార్కెట్ వ్యవస్థ మనకెందుకు? పండించే రైతును, సంపాదించిన ధనంతో కొనే ప్రజలను గౌరవించి, వారితో సమానంగా మార్కెట్ వ్యవస్థ లాభాలు పంచుకోవాలి. అయితే రైతుకు ఎక్కువ ధర ఇవ్వండి లేదా వినియోగదారుడికి తక్కువ ధరకు అమ్మండి. అనవసరంగా రేట్లు పెంచి, స్వలాభాపేక్షతో సమాజంలోని ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయవద్దు.

రైతువద్ద పప్పుదినుసులు 45-50 రూపాయలకు కొంటే మార్కెట్‌లో అది రూ. 150-200ల వరకు అమ్ముతున్నారు. కొర్రలు కిలో రూ 25లు రైతువద్ద తీసుకుని మార్కెట్‌లో రూ. 90-100లకు కిలో అమ్ముతున్నారు. ఉప్పు రైతుల వద్ద ఒక కిలో ప్యాకెట్ ఒక్క రూపాయికి కొంటారు, అందులో రైతుకు మిగిలేది అర్ధ రూపాయి మాత్రమే. అదే ఉప్పు వంద కిలోమీటర్ల దూరంలో వున్న పట్టణంలో కిలో రూ. 7లకు అమ్ముతున్నారు. ఇదంతా అన్యాయం కాదా? ఫ్రీ మార్కెట్ పేరుతో కష్టపడి పండించిన రైతులకు, కూలీ పని చేసి, ఉద్యోగాలు చేసి సంపాదించిన ప్రజలకు భారీ నష్టం చేస్తుంటే ప్రభుత్వం, రాజకీయ నాయకులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, మార్కెట్ విశ్లేషకులు ఏం చేస్తున్నారు?

నిజంగా సేంద్రియ వ్యవసాయం వల్ల లాభం ఎవరికి జరుగుతున్నది?

సేంద్రియ వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యాలు బాగుపడాలి వాతావరణ కాలుష్యం తగ్గాలి. పశు పక్ష్యాదులు పెరగాలి. భూమిలో పుష్టి పెరగాలి. తక్కువ ఖర్చుతో పండించే ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తక్కువ ధరకే ప్రజలకు అందించాలి. అప్పుడే దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండే అవకాశముంటుంది.

2006 మే నెలలో ప్రారంభమైన 'పల్లెసృజన' పత్రిక గత పది సంవత్సరాలుగా పల్లె జ్ఞానాన్ని తెలుగు పాఠకులకు పంచడానికి కృషి చేస్తున్నది. ఇది 50వ సంచిక. మీ ఆశీర్వాదాలు, సహకారం, జ్ఞాన పిపాస మమ్మల్ని శత సంచిక దాకా తీసుకు వెళ్ళగలదని సంపూర్తిగా విశ్వసిస్తున్నాం.



ఈ వర్షాకాలం బాగుంటుందన్న ఆశలతో రెండు సంవత్సరాలుగా, కరువుతో విలవిలలాడిన రైతులకు శుభదినాలు వస్తాయన్న విశ్వాసంతో అందరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలన్న తపనతో....

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**

# యువ రైతులకు ఆదర్శం రాజిరెడ్డి వ్యవసాయం



అమ్మన రామక్రిష్ణారెడ్డి, వెంకటమ్మల ముగ్గురు సంతానంలో చివరి వాడు అమ్మన రాజిరెడ్డి. పూర్వం నుండే వ్యవసాయ కుటుంబమైన రాజిరెడ్డి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇంటర్మీడియట్‌కు మించి చదవలేక పోయాడు. ఆ తరువాత తన చిన్నాన్న అయిన బైరు క్రిష్ణారెడ్డి స్వగ్రామమైన 'చింత మడక'కు వెళ్ళి అక్కడ తన చిన్నాన్న 'పొప్పాయి' వ్యాపారంలో చేదోడు వాదోడుగా వుండేవాడు. అక్కడ వ్యవసాయంలోని మెళకువలను నేర్చుకున్నాడు. ఆ తర్వాత సిద్దిపేట ప్రాంతంలోని మిట్టపల్లి వద్ద గల 'వాట్సల్ ఆర్గానిక్' అనే సంస్థలో దినసరి వేతనంతో ఉద్యోగంలో చేరాడు. అక్కడ ఒక మూడు సంవత్సరాలు చేసిన తర్వాత ఇలా ఉద్యోగాలంటూ ఊళ్ళవెంట తిరిగేకంటే వ్యవసాయమే మేలేమోనని అనుకున్నాడు.

ఉద్యోగం చేసుకుంటున్న సమయంలోనే వివాహం జరిగింది. ఆ తర్వాత 2002లో వరికోత యంత్రాన్ని కొనుగోలు చేసి దాదాపు దేశంలోని అన్ని రాష్ట్రాలలో తన యంత్రంతో కిరాయి పనులు చేశాడు. ఈ తిరుగుడు వల్ల ఆరోగ్యం పాడవుతోంది, కుటుంబానికి కూడా దూరం అవుతున్నామని గ్రహించాడు. తన స్వగ్రామమైన దుబ్బాక మండలం చెల్లాపూర్‌లో కొంత వ్యవసాయ భూమి వున్నా, వరికోత యంత్రం ద్వారా వచ్చే ఆదాయంతో తన భార్య స్వగ్రామమైన మెదక్ జిల్లా బందారం గ్రామంలో 2003లో మూడు ఎకరాల పొలం కొనుగోలు చేశాడు. అల్లం, పచ్చిమిర్చి, తమోట లాంటి కూరగాయల పంటలు వేసి దినసరి ఆదాయాన్ని చవిచూశాడు. ఆ తర్వాత ఇద్దరు మిత్రులతో కలిసి తన పొలం సమీపంలో 40 ఎకరాల పొలాన్ని కూడా కొనుగోలు చేశాడు. నాడు పొలం విలువ తక్కువగా వుండటంతో ఆ పొలం కొనుగోలు సాధ్యమైంది. అందరూ కలిసి ఆ పొలంలో వ్యవసాయం చేసుకుంటూ వుండగా, తన మిత్రులకు ఈ వ్యవసాయం గిట్టుబాటు కాదనిపించటంతో వారు తన భాగం నుండి దూరం కావడం మరో ఇద్దరు మిత్రులు జత కావడంతో వారు భాగస్తులైన

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**

తర్వాత మరో 40 ఎకరాల పొలం కొనుగోలు చేయటం జరిగింది.

ఆ తర్వాత 2006లో పొప్పాయి నాటడం జరిగింది. అందులో విపరీతమైన నష్టాలు రావటం, తన మిత్రులు మావల్ల కాదనటంతో వాళ్ళు వెళ్ళిపోగా, వారికి డబ్బు చెల్లించి, మొత్తం పొలం ఇకపై తానే వ్యవసాయం చేయాలనుకున్నాడు. వ్యవసాయంతో పాటు మరో ఆదాయం కూడా వుంటే బావుంటుంది అనుకుని 18 లక్షల రూపాయల బ్యాంకు ఆర్థిక సహాయంతో పాడి పరిశ్రమను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. నాడు పాలకు గిట్టుబాటు ధర సరిగా లేకపోవటంతో వచ్చిన ఆదాయం బ్యాంకు కిస్తీకి, ఆవుల దాణాకు మాత్రమే సరిపోతున్నాయి, అందులో ఈ పనిలో ఎక్కువ శ్రమ, తక్కువ ఆదాయం వస్తోందని డైరీ ఫాంను తీసివేయటం జరిగింది.

ఇక ఇలా కాదని పందిరి వ్యవసాయం చేపడితే బావుంటుందని భావించి, మొదట 3 ఎకరాల్లో పందిర్లు వేశాడ. ఈరకం వ్యవసాయం లాభసాటిగా వుందని గ్రహించి ప్రతియేటా పందిరిని పెంచుకుంటూ, ప్రస్తుతం 20 ఎకరాల పొలంలో పందిర్లు వేసి, కూరగాయల పంటలను పండించడం మొదలు పెట్టాడు. ఈ పందిరి వ్యవసాయం మంచి లాభాలను ఆర్జిస్తుండగా ఈ కూరగాయలను రసాయనిక పద్ధతుల ద్వారా పండించటం వల్ల నాణ్యతలో కొంత తేడా రావటం, నిలువ వుండని పరిస్తితులు, మార్కెట్‌లో సరియైన ధర పలకక పోవటంతో, రసాయనం





నుండి సేంద్రియ వ్యవసాయం వైపుకు తన దృష్టిని మళ్ళించాడు.

గత రెండు సంవత్సరాల నుంచి సేంద్రియ వ్యవసాయం లాభసాటిగా మారిందని, ప్రస్తుతం ఎక్కువగా తమోట, అనప, బీర, కాకర, బూడిద గుమ్మడి, ఎర్ర గుమ్మడి లాంటి తీగజాతి పంటలపైనే ఎక్కువ దృష్టిని సారించి, మంచి ఆదాయాన్ని చవిచూస్తున్నాడు. తక్కువ రోజుల్లో కాపుకు వచ్చే కొన్ని పంటలలో అతి తక్కువ మోతాదులో డిఎపి లాంటి ఎరువులను వాడతాడు. అది కూడా నేరుగా పొలంపై వేయకుండా ఎరువులను డ్రిప్పు ద్వారా అందించటం వల్ల ఎరువు నేరుగా మొక్కకు అందటం వల్ల తక్కువ మోతాదులో ఎరువులు అవసరమౌతాయి. దీనివల్ల కూడా కూలీల ఖర్చు లేకుండా పోయింది. 20 ఎకరాల్లో ఎరువులు వేయాలంటే వారం, పదిరోజులు పట్టేది డ్రిప్పు ద్వారా కేవలం ఒకటి రెండు గంటల్లోనే ఎరువులు వేసే పని అయిపోతుంది. సేంద్రియ వ్యవసాయం వైపుకు మళ్ళటంతో పురుగులు, తెగుళ్ళ బెడద బాగా తగ్గుముఖం పట్టడంతో క్రిమి సంహారకాలు కూడా వాడే అవసరం చాలావరకు తగ్గిపోయింది అంటాడాయన.

ఆ తర్వాత మల్చింగ్ పేపర్ వేసి మొక్కలు నాటడంతో కలుపు కూలీల ఖర్చు అస్సలు లేకుండా పోంవటంతో 60 శాతానికి పైగా కూలీల ఖర్చు తగ్గిపోయింది. పైగా తెగుళ్ళు రావటం చాలావరకు తగ్గిపోయింది. ఆ తర్వాత నీటి యాజమాన్యంపై దృష్టి

**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.**



సారించి, డ్రిప్పులను అమర్చడం ద్వారా గతంలో 5 ఎకరాలకు పారే నీరు ప్రస్తుతం 20 ఎకరాలకు సరిపోతోంది. ఒక మినీ ట్రాక్టరును కూడా ఏర్పాటు చేసుకోవటంతో కూలీల ఖర్చు నామమాత్రంగా మారిపోయింది. రాజిరెడ్డి తన పొలలోనే 7-8 కూలీల కుటుంబాలు ఉండేందుకు అనువుగా వారికి షెడ్లను నిర్మించటంతో వారు అక్కడే వుండి పొలం పనులు చూసుకుంటూ వుంటారు. వారు తన పొలం పనులను చూసుకుంటున్నందుకు ఇతను వారి కుటుంబ సంక్షేమాన్ని కూడా చూసుకోవటం ఎంతో ఆదర్శప్రాయం.

ఈ పందిరి వ్యవసాయంలో మొక్కలు నాటేందుకు బోదెలు చేయాలంటే విపరీతమైన కూలీలు అవసరమయ్యేది. యంత్రీకరణ పద్ధతులను అవలంభించటం వల్ల ఆ ఖర్చు కూడా లేకుండా పోయింది. రెయిజింగ్ బెడ్‌లు తయారు చేసి వాటిపైన మొక్కలు నాటడం వల్ల మామూలుగా చదును నేలపై నాటినప్పుడు వచ్చే దిగుబడికన్నా అధికంగా రావటం మొదలు పెట్టింది. ఇలా రైజింగ్ బెడ్‌లు ఏర్పాటు చేసుకోవడం వల్ల మొక్కల వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెంది, మొక్కకు అదనపు బలాన్ని అందించటంతో అధిక దిగుబడి వస్తున్నట్లు గమనించాడు రాజిరెడ్డి. ఈ పద్ధతిని ఉపయోగించడం వల్ల మొక్క దిగుబడి నాణ్యత అధికంగా వుంటుందని, ఎత్తుపైన వుండటంతో మొక్కలు కూడా ఎప్పుడైనా వర్షాలు అధికంగా కురిస్తే కూడా మొక్క కుళ్ళిపోయే అవకాశం లేదంటున్నాడు.

ఇక మార్కెటింగ్‌కు వచ్చేసరికి రాజిరెడ్డి ఎక్కువ మోతాదులో కూరగాయల పంటలు పండించటంతో మార్కెట్‌దారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేయటం వల్ల మార్కెటింగ్ ఖర్చులు లేకుండా పోయాయి. మాల్స్ యజమానులే పొలం వద్దకు వచ్చి కొనటం వల్ల దళారీ వ్యవస్థను కూడా నియంత్రించ గలిగాడు. ఎలాంటి కమీషన్లు లేకుండా తన దిగుబడులను అమ్ముకోగలుగుతున్నాడు.

రాజిరెడ్డి చేస్తున్న వ్యవసాయంలో అతను ప్రధానంగా పాటించిన అంశాలు కూలీల ఖర్చును తగ్గించుకునేలా పంటలను ఎన్నుకోవటం, నీటిని వీలైనంత పొదుపుగా వాడటం, మార్కెట్ సదుపాయాన్ని, విలువలను బేరీజు వేసుకుని పంటలు వేయటం. ఇతను తన పొలంలో ఎరువులు వేయటంలో కూడా ఎన్నో మెళకువలను పాటించాడు. దాదాపు అన్ని పంటలను సేంద్రియ పద్ధతిలోనే పండిస్తాడు. అతి తక్కువ పంటలకు మాత్రమే స్వల్పంగా రసాయనిక ఎరువులను వాడటం జరుగుతుంది. వీలైనంత వరకు క్రిమి కీటకాలు ఆశించకుండా సమగ్ర సస్యరక్షణ చేపడతాడు. తెగుళ్ళు ఆశించినచో వీలైనంత వరకు సేంద్రియ క్రిమి సంహారకాలనే వాడతాడు.

- రాజిరెడ్డి సాగు చేస్తున్న దాదాపు 40 ఎకరాల పొలానికి ఎరువులు వేయాలంటే 35 మంది కూలీలు అవసరం. కానీ, ఈ ఎరువులను నీటి డ్రమ్ములలో నానబెట్టి ఆ నీటిని డ్రిప్పుల ద్వారా అందించటం వల్ల కేవలం ఇద్దరు మనుషులతోనే ఈ పని పూర్తి చేస్తున్నాడు.
- ప్రతి పంటకు డ్రిప్పు పద్ధతిని ఉపయోగించుకోవటం ద్వారా అత్యంత నీటిని పొదుపు చేస్తున్నాడు. తనకున్న 6



మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.



బోర్లలో కేవలం రెండింటినే వినియోగించుకునే గత సంవత్సరం పంటలు పండించాడు.

చాలామంది రైతులు వ్యవసాయంలో లాభాలను బాగా ఆర్జించిన తర్వాత గ్రామ రాజకీయాలలో పాల్గొంటూ రాజకీయాల వైపుకు మొగ్గు చూపుతారు. కానీ, రాజిరెడ్డి మాత్రం తనకు రాజకీయ కుటుంబాలతో బంధుత్వం వున్నా, తాను మాత్రం రాజకీయాలలోకి అడుగు పెట్టలేదు. తన ప్రపంచం వ్యవసాయమే అని నమ్మిన వ్యక్తి రాజిరెడ్డి. కనీసం స్థానిక రాజకీయాల వైపుకు కూడా అడుగు పెట్టలేదు.

పంటలలో నష్టాలను చవిచూడటం వల్ల రైతాంగం వ్యవసాయంపై విముఖత చూపుతున్నారు. మరీ ముఖ్యంగా యువకులు వ్యవసాయం అంటే భయపడి పోతున్నారు. దీనికి కారణం ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవసాయం చేసే మెళకువలు లేకపోవటమే ప్రధాన కారణమంటాడు రాజిరెడ్డి. తక్కువ సమయంలో దిగుబడులను ఇచ్చే పంటలను ఎక్కువగా వేస్తూ దీర్ఘ కాలిక పంటలను తక్కువ మోతాదులో వేసుకుంటే రైతుకు తప్పకుండా గిట్టుబాటు అవుతుందని అంటాడు రాజిరెడ్డి. తన పొలంలో నీరు పారే అవకాశం వున్న గట్ల పొడవునా ఇంకుడు గుంతలను కూడా త్రవ్విస్తున్నాడు. దీనివల్ల ఇకపై నా పొలానికి నీటి సమస్య దాదాపు వుండదనే విశ్వాసంతో వున్నాడు.

తక్కువ కమతాలు గల సన్నకారు రైతులు అతి స్వల్ప సమయంలో పంటకు వచ్చే కొత్తిమీర, ఆకు కూరలు లాంటి పంటలు వేసుకున్న వారు ఇంకా లాభసాటిగా వ్యవసాయం చేస్తున్న విషయం కూడా తాను గమనించానంటాడు. ప్రస్తుత సమాజంలో సన్నకారైనా, పెద్ద రైతుకైనా ఖర్చులు మాత్రం సమానంగా ఉంటున్నాయి. కాబట్టి మన ఖర్చులకు అనుగుణంగా పంటలపైనే సంపాదించాలి అన్న దృష్టికోణంలో ఆలోచించి ఆధునిక వ్యవసాయ పద్ధతులను, సాగు మెళకువలను పాటించి సాంకేతను జోడించి వ్యవసాయం చేసుకుంటే రైతు తప్పకుండా వృద్ధిలోకి వస్తాడన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. రాజిరెడ్డి చేస్తున్న వ్యవసాయ పోకడలను ఆచరించి యువ రైతులు వ్యవసాయంలో లాభాలను ఆర్జిస్తారని ఆశిద్దాం. ఆయన స్ఫూర్తితో చాలామంది యువకులు వ్యవసాయాన్ని వృత్తిగా చేసుకుంటారని మనసారా కోరుకుంటున్నాం. వ్యవసాయానికి దూరంగా పోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో యువకులకు రాజిరెడ్డి లాంటి కృషీవలుడు ఆదర్శంగా నిలుస్తారని మా నమ్మకం. ●



**సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.**

పల్లెసృజన పత్రిక ప్రారంభించి నిరాటంకంగా 50వ సంచిక మీ ముందుంచుతున్న శుభ సందర్భంలో

# మనసులో మాట



జమ్మలమడక శశిమోహన్
ఎడిటర్

మట్టిలో మాణిక్యాలుంటాయి. అందులోనూ భారతదేశ గ్రామాల మట్టిలో మాణిక్యాలకి కొదవ లేదు. ఇక్కడ నేను ప్రస్తావించేది మణులు, మాణిక్యాలు, కోహినూర్ల గురించి కాదని మనవి. అంతకన్నా ఎంతో విలువైనవి, అంతకన్నా ఎంతో కాంతివంతంగా మెరిసే గ్రామీణ సృజనల గురించి అని గుర్తించాలి. 'ఒక ఐడియా ఒక జీవితాన్నే మార్చేస్తుంది' అని ఎవరో అంటే "ఒక సృజన సమాజాన్నే మార్చేయగలదు" అని నేనంటాను.

'అవసరం' అన్నది ఆవిష్కరణలకు, సృజనాత్మకతకి మూలం అవుతుంది. ప్రతి అవసరం ఆలోచింపజేస్తుంది. ప్రతి ఆలోచన నుంచి ఒక సృజన ఉద్భవిస్తుంది. మనం గ్రామాలలో ఉపయోగించే వస్తువులు, వంట చేసే పొయ్యి దగ్గర నుండి గుడిసెలు వేసుకునే పద్ధతి నుంచి, వ్యవసాయానికి వాడుకునే నాగలి, పార, కొడవలి..... ప్రతిదీ మార్పుకు లోనయ్యాయి. ఈ మార్పులన్నీ ఏ పరిశోధన శాలలో అయినవి కావు. సామాన్య గ్రామీణులు తమ అవసరాలకి తగ్గట్లుగా మార్పులు చేసుకున్నారు. ఈ మార్పులు వారి జీవితాల్లోనే కాక, అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపాయి. అందుకే 'పల్లెసృజన' (అ)సాధారణ గ్రామస్తులని గ్రామీణ శాస్త్రవేత్తలు అంటుంది.

ఒక దేశ అభివృద్ధి అన్నది ఆ దేశ ప్రజల సృజనాత్మకత, వినూత్న అన్వేషణలు చేసేవారి సామర్థ్యాల పైనే కాక, వాటిని ఉపయోగించుకోవటం అన్నదానిపై ఆధారపడి వుంటుంది. విద్యాధికులు పరిశ్రమల కోసం పెద్దపెద్ద పరిశోధనాలయాలలో పరిశోధనలు చేసి, వాటిని సమాజంపై రుద్ది, అవి ఉపయోగపడినా లేకపోయినా వారుమాత్రం ఆర్థికంగా బాగుపడుతున్నారు. వాటివల్ల గ్రామాలకి ఒరిగిందేమీ కనపడటం లేదు. మనదేశంలో ఎక్కువమంది జనాభా గ్రామాల్లో నివసిస్తున్నారు. వారు తరతరాలుగా వ్యవసాయం లేదా సాంప్రదాయ వృత్తులను అనుసరిస్తూ వారికున్న అవసరాలకి తగ్గట్టుగా సమస్యలకి పరిష్కారాలుగా ఎన్నో సృజనాత్మక ఆవిష్కరణలు చేసుకుంటున్నారు. అవన్నీ వెలుగులోకి రాకుండా కనుమరుగై పోతున్నాయి. ఒక గ్రామంలో వెలిగిన ఆలోచన ఇంకొక గ్రామానికి.... కనీసం ప్రక్క గ్రామానికి కూడా చేరటం లేదు.

వీరి సామర్థ్యానికి, ఆలోచనలకి, ఆవిష్కరణలకి వెలకట్టలేం కానీ, వాటి గురించి వ్రాసి, వెలుగులోకి తెచ్చి, అందరికీ ఉపయోగ పడేలా చేయాలి. ఈ క్రమంలో ఆవిష్కరణ చేసిన గ్రామ శాస్త్రవేత్త కూడా బాగుపడాలి. ఈ పని చేయటానికి జాతీయ స్థాయిలో 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్.ఐ.ఎఫ్.) ఆచార్య అనిల్ గుప్తా గారి ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాల నుండి 'హనీబీ' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పనిచేస్తోంది. దేశ స్థాయిలో హనీబీ చేసే పనినే తెలుగు ప్రాంతంలో 'పల్లెసృజన' చేస్తోంది. 'హనీబీ' అంటే తేనెటీగ. తేనెటీగ రెండు పనులు చేస్తుంది. అది పువ్వుకు ఎటువంటి హానికాని, నొప్పిగాని కలగకుండా దానినుండి తేనెను సేకరిస్తుంది. అది చేస్తూనే పువ్వుల మధ్య పరపరాగ సంపర్కానికి కారణమై తద్వారా పండు పుట్టడానికి దోహద పడుతుంది. 'పల్లెసృజన' కూడా అదే ఆదర్శంగా తీసుకుని విజ్ఞానం (తేనె) సేకరిస్తూనే దానికి తగ్గ లాభాలు (పండు) విజ్ఞానకర్తకు అందేలా చేస్తుంది. ఎవరూ నష్టపోకుండా చూడాలన్నదే 'పల్లెసృజన' ఆశయం.

గ్రామాల్లోని సృజనలను, సాంప్రదాయ జ్ఞానాన్ని వెలి తీయటానికి పల్లెసృజన 'శోధయాత్రలు' చేసి, జ్ఞాన సేకరణ చేసి, గ్రంథస్తం చేసి, విజ్ఞానానికి సిద్ధాంత రూపం

కష్టాల సారాంశమే విజయం.

కల్పించి, వ్యాప్తి చేయటం, జ్ఞానానికి తగ్గ గుర్తింపు వచ్చేలా చేయటం..... ఇవి పల్లెసృజన చేసే కార్యక్రమాలు.

బ్రిగేడియర్ పోగుల గణేశం సైన్యం నుంచి రిటైరైన తర్వాత డా. కె.ఎల్. రావ్, చంద్రకాంత్ శర్మ, పల్లె వీర రాఘవ రెడ్డి, అరుణ, జాగర్లమూడి దుర్గాప్రసాద్, జమ్మల మడక శశిమోహన్, శ్రీకర్ లాంటి వారిని కలుపుకుని ముందుకు సాగుతున్నారు.

ఏ సంస్థ అయినా ఎంత మంచి పనులు చేసినా, అది నలుగురికీ చెప్పకపోతే, అందులోనూ నలుగురికీ జ్ఞానాన్ని పంచటమే ధ్యేయంగా పెట్టుకున్నపుడు దానికంటూ ఒక పత్రిక ఉండటం తప్పనిసరి. ఆవిధంగా మే 2006లో పుట్టినదే మన 'పల్లెసృజన' పత్రిక.

పెళ్ళి చేసి చూడు, ఇల్లు కట్టి చూడు అన్నారు పూర్వం. బహుశా ఆ అన్నవాళ్ళు ఏ పత్రికా నడిపి వుండరని నా అభిప్రాయం. ఒకే ఆలోచనలు కలిగిన వారు ఐచ్ఛికంగా డబ్బు ప్రసక్తి లేకుండా ఒక సంస్థని నడపటం సులభం కాదు. పైగా ఆ సంస్థ చేస్తున్న కార్యకలాపాలను నలుగురి మేలుకోసం పల్లెసృజనలను, సాంప్రదాయ జ్ఞానాన్ని వ్యాప్తి చేయటం కోసం ఒక పత్రికను నడపటం ఆషామాషీ కాదు. దేశంలో 49 వేలపైచిలుకు పత్రికలుండగా మీ 'పల్లెసృజన' ప్రత్యేకత ఏమిటి? అని అడిగినవారూ ఉన్నారు. పల్లెసృజన పత్రిక వేరు.... చాలా వేరు.... మరి ఎందుకయ్యా ఇంత కష్టమైన పని చేయటం అని అన్నవాళ్ళూ ఉన్నారు. దానికి అయ్యా, సులభం కాదు అనుకున్న వాళ్ళమే కాని, కష్టమైన పని అని మేమెప్పుడూ అనుకోలేదు. దీంట్లో పనిచేసే, తోడ్పాటు ఇచ్చే అందరూ ఇష్టంతో పని చేస్తున్న వారే కనుక 'కష్టం' అన్న పదానికి అర్థం లేదు. ఆ..... ప్రకటనల ఆదాయం లేకుండా పత్రిక నడపటం, చమలు – గిమకులు లేకుండా పత్రిక నడపటం, ఏదో మారుమూల పల్లెల్లో ఎవరో పేరు తెలియని గ్రామస్తులు తయారు చేసిన/ చెప్పిన సాంప్రదాయ జ్ఞానాన్ని వివరంగా వ్రాసే పత్రిక నడపటం కష్టమే. అన్ని పనులు మేమే ఇష్టపడి, ప్రేమతో చేసుకుంటాం కనుక ఎప్పుడూ కష్టమనిపించలేదు. ఎందుకంటే "మీ పల్లెసృజన పత్రిక దాదాపు మీరు ప్రారంభించి నప్పటినుండి కూడా విడవకుండా చదువుతున్నాను .... దానిలోని వివరాలు ఎంతో ఆలోచింపజేసేలా ఉన్నాయి..... మా సమస్యలకి ఎంతో తెలివైన పరిష్కారాలు దొరుకుతున్నాయి.... నాకు ఎంతో కాలంగా ఉన్న జబ్బు మీ పత్రిక ద్వారా పరిచయమైన మూలికా వైద్యుని వద్దకు వెళ్ళి వైద్యం చేసుకున్నాక తగ్గిపోయింది.... యువతను మీ శోధయాత్ర ద్వారా జాతీయ నిర్మాణానికి పురి గొల్పుతున్నారు.... దయచేసి మాకు మీతో కలిసి పనిచేసే అవకాశమివ్వండి..... ఇలా గ్రామీణ భారతాన్ని ప్రతిబింబింపజేసిన పత్రికను నేను ఇంతవరకు చూడలేదు..... శతమానం శీర్షికన వయోవృద్ధుల జీవిత సారాన్ని/ జ్ఞానాన్ని మీ పత్రిక ద్వారా అందించే పద్ధతి బావుంది...... ఒక వృద్ధుడు చనిపోతే ఆ గ్రామంలో ఒక గ్రంథాలయం కాలిపోయినంత నష్టం కలుగుతుంది అన్న మీ ఆలోచనకి మా జోహార్లు..... సామాన్య గ్రామ గల్లీలలో కూడా గుర్తింపు లేని నాకు ఢిల్లీలో రాష్ట్రపతి గారి ద్వారా సన్మానం చేయించిన పల్లెసృజనకు సర్వదా రుణపడి వుంటాను.... చక్కని సరళమైన భాషలో ఉత్కృష్టమైన ఆలోచనలు వివరించే మీ పద్ధతి ఎంతో శ్లాఘనీయం........" లాంటి స్పందనలు వింటూవుంటే, చూస్తూవుంటే, చదువుతూ వుంటే ఎంత శ్రమైనా (కష్టమని అనటం లేదండోయ్) ఆనందంగా పడతాం.

ఈ ప్రస్థానంలో ఎన్నో కథలు.... ఎందరో ఇన్నోవేటర్లు..... ఇంకెన్నో సంఘటనలు..... ఆసు యంత్రం రూపశిల్పి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ బృందం తయారు చేసిన శ్రీశైలం, బొమ్మగాని మల్లేశం రూపొందించిన, లైట్లు, ఫ్యాన్‌లకు రిమోట్, సోలార్ స్ప్రేయరు, చిడిపి నాగభూషణం మొబైల్ బేకరీ, చెరువుల్లో గుర్రపు డెక్క తీసే యంత్రం రూపొందించిన గోదాసు నర్సింహ, కోరంపల్లి చంద్రశేఖర్ చేసిన ఇటుకల తయారీ పరికరం, వెంకటకృష్ణ తయారు చేసిన సేంద్రియ క్రిమి సంహారిణి తులసి, బోయ పెద్దరాజన్న లక్షలాది పశువులకి పొదుగువాపు వ్యాధికై అందించిన వైద్యం, ముప్పారపు రాజు వృధాగా లైట్లు వీధిలైట్లు వెలగకుండా ఆర్పే పరికరం,

**పైదాకా ఎక్కటానికి శక్తి కావాలి. అది హిమాలయాలైనా సరే, నీ వృత్తిలోనైనా సరే.**

పాటిబండ్ల లీలావతి శ్రమలేకుండా బట్టలు ఉతికే విధానం, యాదయ్య వరి విత్తనం వేసే సీడర్, బాబూరావ్ మనుషులు లాగే 5 రకాల పనులు చేసే సీడ్ డ్రిల్, గురవయ్య హెర్బీ మరి సీడ్ డ్రిల్, పటాన్ సైదా గాలిమర నీటి పంపు, మహిపాల్ చారి ఇప్పటికే 250కి పైగా అమ్మిన మనిషి నడిపే వీడర్, పందిరి పుల్లారెండు రూపొందించిన రెండు బోర్లకు ఒకే పంపుసెట్, పాలడుగు మునిరత్నం సేంద్రియ వ్యవసాయం, పాండురంగారావు టైర్లు పంచరు కాకుండా తయారు చేసిన లిక్విడ్, పశువులతో పని చేసే రమేష్ సీడర్, జీవ వైవిధ్యం కాపాడే యజ్ఞంలో భాగంగా దాదాపు 450 రకాల విత్తనాలు సేకరించిన పిల్లవాడు రమేష్, మోటార్ సైకిల్‌తో తన అరటి తోటలో సేద్యం చేసుకుంటున్న నాగరాజు, కంప్యూటర్ విడి భాగాలతో ఒకవైపు వేడిగాలి, మరోవైపు చల్లటి గాలి వీచేలా ఫ్యాన్‌ను రూపొందించడం..... ఇలా ఎంతోమంది గ్రామీణ శాస్త్రవేత్తలని కలవడం, వారితో మాట్లాడటం, వారి కథలని వ్రాయటం ఎప్పుడూ కష్టమనిపించలేదు. ఆనందమేసింది.

గత పదేళ్ళ ప్రయాణంలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్ సదస్సులలో చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ (శ్రీశైలం), బోయ పెద్ద రాజన్న, భూమయ్యచారి, నజీర్ అహమ్మద్, శాంసంగ్ సంస్థ వారు మల్లేశం, తొండపి గురవయ్యలతో సహా ఇప్పటివరకు 12 మందికి రాష్ట్రపతి పురస్కారం అందేలా కృషి సల్పటం లాంటివి అద్భుతమైన పల్లెసృజన అవకాశాలు. మల్లేశం చైనాలో ద్వితీయ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనటం (2012), సయ్యద్ సుభానీ బూమ్ స్ప్రేయర్ 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కటం, మల్లేశం రాష్ట్రపతిగారి అతిథిగా ఢిల్లీలో 15 రోజులు ఉండటం...... ఎన్ని సంబరాలు, ఎన్ని సంతోషాలు.. వీటిగురించి రాస్తూవుంటే ఆనందం వేస్తుంది. కష్టమనిపించదు. డా. అరవీటి రామ యోగయ్య, యారేశ్వరి, వర్ల రామయ్య, గోదాసు నర్సింహలకు సృష్టి అవార్డులు లభించడం. ముప్పా కృష్ణమూర్తి తన అద్భుత కళాత్మకత అయిన వరిగడ్డితో చీర, కండువాలతో సహా ఎన్నో రకాల రైతుకు అవసరమైన వాటిని తయారు చేయటమే కాదు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రదర్శన శాలలో ఈయన పనితం చూసి ముగ్ధుడైన రాష్ట్రపతికి కండువాను తన చేతులమీదుగా బహుమతిగా అందజేయడం, ఇటీవల ముళ్ళపూడి సత్యనారాయణ గేర్ల సహాయంతో మనిషి నడిపే టిల్లర్ రూపొందించడం.... ఎన్నో, ఎన్నెన్నో.....

సైకిల్ తొక్కే పంపు కనిపెట్టిన విక్రం రాథోడ్‌కి, మల్లేశం ఆసు యంత్రానికి .... పేటెంట్లు రావటం గురించి రాస్తూవుంటే ఆనందం కాక మరేమిటి. ఇంత గొప్పవాళ్ళను గురించి మన పల్లెసృజనలో రాస్తున్నాం కదా అనిపించేది.

పల్లెసృజన నిర్వహించిన మూలికా వైద్యుల సదస్సులు, కుటుంబ సమావేశాలు, నాబార్డ్ సహాయం, ఇతర సంస్థలు, పరిశోధనాలయాలతో చేసుకున్న ఒప్పందాలు, ఎన్ని కబుర్లు పంచుకున్నాం. ఇదంతా ఆనందం కాక మరేమిటి?

'పల్లెసృజన' సంస్థకీ బహుమతులు వచ్చాయి. మహేంద్ర సంస్థ వారు 2014 సంవత్సరానికి 'కృషి సహయోగ్' పురస్కారంతో పల్లెసృజనను సత్కరించారు. ఇదీ ఆనంద దాయకమైన మలుపే కదా!

మంచి పనులు, సమాజానికి మేలు చేసే పనులు చేస్తున్న సంస్థ, ఆ వివరాలు రాస్తున్న పల్లెసృజన పత్రిక.... మేము అనుకున్నంత మందిచేత చదివించలేక పోతున్నామనే బాధ మమ్మల్ని పీడిస్తూనే వుంది. ఎన్నో ప్రయత్నాలు చేశాం, పండగలు, పర్వదినాలలో మిత్రులకి, బంధువులకి 'పల్లెసృజన' పత్రికని బహుమతిగా ఇవ్వండి అన్నాం. మీ స్వంత గ్రామానికి మీ తరుపున పత్రికను అందేలా చేయండి అన్నాం. జ్ఞానయజ్ఞం పేరున ఉద్యమం చేపట్టాం. ఎవరో కొందరు సామాజిక స్పృహవున్న వారి ప్రోత్సాహంతో వారు అందించిన ఆర్థిక సహాయంతో కొన్ని ప్రాంతాలకి పత్రికను అందించాం. రెండు నెలలకి 30 రూపాయలు ఒక్క ప్లేటు ఇడ్లీ ఖర్చుకన్నా తక్కువ...... అయినా ......

సమాజానికి మేలు చేయాలని కొందరు ఔత్సాహికులు ప్రారంభించిన పల్లెసృజన పత్రికని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని మారుమూల పల్లెలకి కూడా చేరేలా చేయటానికి మీ అందరి తోడ్పాటు కోరుతున్నాం. ●

**విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.**

# అధిక దిగుబడినిచ్చే "కంది" విత్తనాలు 'రిచా-2000'



ఉభయ తెలుగు రాష్ట్రాల రైతాంగానికి 'పల్లెసృజన' అందిస్తున్న మహదవకాశం 'రిచా-2000' కంది విత్తనాల వితరణ. మధ్యప్రదేశ్‌కు చెందిన 'రాజ్‌కుమార్ రాథోరే' అనే సృజనాత్మక రైతు ఈ అధిక దిగుబడినిచ్చే కంది రకాన్ని అభివృద్ధి చేశాడు. ఏపుగా గుబురుగా పెరిగే ఈ కంది రకం ఆయన వాణిజ్యపరంగా వ్యవసాయం చేయుటం ప్రారంభించిన 1997లో కనుగొన్నాడు. ఈ కంది మొక్క చాలా ఏపుగా పెరిగి, పచ్చగా పెద్దపెద్ద పూలతో పొడుగాటి ఆకులతో కనిపించింది. దీనిమీద ఆయన ప్రయోగాలు చేసి మంచి ఫలితాల కోసం మొక్క ఏపుగా పెరగటానికి, అధిక దిగుబడి రావటానికి తలలు తుంచేస్తూ వచ్చాడు. ఇది సంవత్సరానికి రెండుసార్లు కోతకు వచ్చి, ఎకరాకి 24 క్వింటాళ్ళ వరకు దిగుబడినిస్తుంది.

**రిచా-2000 కంది విత్తనం ప్రత్యేకతలు:**

❀ విత్తటానికి ఎకరాకు 3 నుంచి 4 కిలోల విత్తనం అవసరమౌతుంది. మిగతా రకాల్లో 8 నుంచి 10 కిలోల విత్తనం అవసరమౌతుంది.

❀ పొలంలో వరుసల మధ్య 4 అడుగుల దూరం, మొక్కల మధ్య 2 అడుగలు లో (4X2)విత్తుకోవాల్సి వుంటుంది.

❀ రిచా-2000 కంది విత్తనాలను జూన్ 15 నుండి జులై 15 లోగా విత్తుకొవాలి.

❀ ఈ రకం కంది సంవత్సరానికి రెండుసార్లు కోతకు వస్తుంది. ఎకరాకు 24 క్వింటాళ్ళ వరకు దిగుబడినిస్తుంది.

❀ ఈ రకం కంది తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్నిచ్చేది.

❀ కంది కాయలు 3 నుండి 4 అంగుళాల పొడవుంటాయి. మిగతా రకాల్లో 2 నుండి 2.5 అంగుళాల పొడవు కాయలు మాత్రమే వుంటాయి.

❀ సంవత్సరంలో రెండుసార్లు కోతకు వస్తుంది. మొదటి కోతను కంది కాయలను గుత్తులుగా కోసి నూర్పిడి చేసుకోవాల్సి వుంటుంది.

❀ పొలం యొక్క బలాన్ని బట్టి, నీటి వసతిని బట్టి ఎకరాకు 15 నుండి 24 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది.

❀ వర్షాధార పంటగా వేసినా సరే మంచి దిగుబడి వస్తుంది.

❀ యాజమాన్య ఖర్చులు కూడా తక్కువగానే వుంటాయి. తెగుళ్ళు, పురుగుల ధాటిని ఎదుర్కొనే శక్తి కలది.

తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ రకం కందిని విస్తృతంగా సాగు చేయటానికి అనువుగా వుంటుంది. ఈ రకం కంది వేయాలనుకున్న రైతాంగం పల్లెసృజన కార్యాలయానికి ఫోన్ చేసి కాని, నేరుగా ఇన్నోవేటర్ ఫోన్ 09406528391 ను సంప్రదించి కాని విత్తనాలు పొందవచ్చు. ఈ రకం కంది సాగుచేసి దిగుబడి వచ్చిన విత్తనాలను నేరుగా మార్కెట్‌లో అమ్ముకో కుండా తిరిగి రైతాంగానికి విత్తనంగా అందజేసి నచో భవిష్య త్తులో రైతాంగమంతా మంచి దిగుబడులను సాధించటంతో పాటు, మామూలు మార్కెట్ ధరకన్నా ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు. ప్రతి సంవత్సరం విత్తనాల కోసం దుకాణాల చుట్టూ ఎగబడకుండా రైతులే విత్తనాలను తయారు చేసుకుని, తోటి రైతులకు అందజేసినచో రైతాంగం ఖర్చులు కూడా చాలా వరకు తగ్గుతాయి. ఈ అవకాశాన్ని తెలుగు రాష్ట్రాల రైతాంగం వినియోగించుకుంటారని ఆశిస్తున్నాం.

మీరు ఈ విత్తనం వేస్తే పంట ఫలితాలు, మీ అనుభవాలు పలెలెసృజనతో పంచుకుంటారని ఆశిస్తున్నాం

**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**

# 'పల్లెసృజన' పరిచయం నా భాగ్యం-అబ్దుల్ కరీం

అబ్దుల్ కరీం తన కుమారున్ని బ్రతికించుకోవడం కోసం వైద్యుడుగా మారిన వైనం 'పల్లెసృజన'లో ప్రచురించిన తర్వాత అతనికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి విపరీతమైన ఫోన్లు రావటం తో తనకు ఫోన్ చేసిన దాదాపు ప్రతి ఒక్కరికి తన వైద్యాన్ని అందించటం ద్వారా అద్భుతమైన ప్రచారం లభించింది. అప్పుడప్పుడు వైద్యం చేస్తూ తన ప్రధాన ప్రవృత్తి అయిన మెకానిజం అయితే, వైద్యమే ప్రధాన వృత్తిగా మారిపోయింది.

ఇన్ని రోజుల వైద్యంలో తానకు అర్థమైన సూత్రం ఒకటుందనిపిస్తోంది అన్నాడు కరీం. అదేమిటంటే "ఆకులు మేసే మేకలు కొండలు ఎక్కుతుంటే ఆ మేకలను తింటున్న మనుషులు మంచాలు ఎక్కుతున్నారు" అంటాడు. ప్రస్తుతం వస్తున్న రోగాల ప్రధాన కారణాలు ఒకటి ఆహార కాలుష్యమైతే రెండోది విపరీతంగా పెరిగి పోయిన మాంసాహారమనే నాకనిపిస్తోంది అంటాడాయన.

నా ప్రవృత్తినే మార్చిన పల్లెసృజనను నేను జీవితంలో మరిచిపోలేను అంటాడు. మెకానిక్‌గా కొంత మందికి మాత్రమే సహాయం చేసే వాడిని, అందులో ఆదాయం బాగానే వున్నా మనసుకు తృప్తిని ఇచ్చేది కాదు. కానీ, వైద్యం చేయటం వల్ల వచ్చే ఆదాయంతో పాటు, మానసికమైన ఆనందానికి గురవుతున్నాను. ఇంతమంది రుగ్మతలను బాగు చేసే అవకాశం నాకు రావటం నేను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో మీ (పల్లెసృజన) ద్వారా తీరుతున్నందుకు ఆనందంగా వుంది. ఇంతమంది రుగ్మతలను బాగు చేయటమే కాకుండా, పల్లెసృజన పరిచయం తర్వాత ఒక చిన్న గదిలో మాత్రమే జీవనం సాగించే నా కుటుంబం ఒక మంచి ఇల్లు కట్టుకోగలిగిందని, అంతే కాక, మరోచోట స్థలం కూడా తీసుకోవడం జరిగిందని అంటాడు కరీం.

పల్లెసృజన పరిచయమైన ఆరు నెలల్లోనే ఇంతటి ఇల్లు కట్టుకున్నాను అంటూ తన ఇంటిని చూపించాడు కరీం. పల్లెసృజన పరిచయం తర్వాత మీరు చేసిన వైద్యాలలో అత్యంత ఉత్తమమైన వాటిని కొన్నింటిని వివరించమని అడగగా... "హైదరాబాద్‌లో నివసించే రామిరెడ్డి అనే వ్యవసాయ శాఖలో పనిచేసిన విశ్రాంత అధికారి రామిరెడ్డి గారు తనకు గల సోరియాసిస్‌ను నయం చేసుకునేందుకు ఎంతోమంది వైద్యులను కలిశాడు, అయినా నయం కాలేదు. పల్లెసృజన పరిచయం తర్వాత ఆయన తనవద్దకు వచ్చినపుడు ఆయనను చూసి నేను మందు తయారు చేసి ఇవ్వగా కేవలం రెండు నెలల్లో తన జబ్బు నయమైందని, నీమందు ఇంతబాగా పనిచేస్తుందని నేను ఊహించనే లేదు" అన్నాడట. "సోరియాసిస్‌కు కరీం ఔషధం అద్భుతంగా పని చేస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు" అన్నాడు రామిరెడ్డి గారు.

మరో వ్యాధిగ్రస్తుడైన నర్సారావుపేటకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి 25 సంవత్సరాలుగా సోరియాసిస్ జబ్బుతో బాధ పడుతూ శరీరమంతా పుండుగా మారటంతో, తాను ఆత్మహత్య చేసుకోవటానికి కూడా సిద్ధమై ఒకటి రెండు సార్లు ప్రయత్నించాడట కూడా. అప్పుడే ఇతర మిత్రుల ద్వారా కరీం పేరు విని చివరి ప్రయత్నం చేద్దామని ఆత్మకూరుకు వచ్చాడట. తన గాథనంతా వివరంగా విన్న కరీం నీ రుగ్మతను నేను తప్పకుండా నయం చేస్తాను అని అతనికి ఔషధాన్ని తయారు చేసి ఇవ్వగా 5 మాసాలు ఔషధాన్ని వాడిన శ్రీనివాస్ ఇప్పుడు ఎంతో ఆరోగ్యంగా వున్నాడట. సోరియాసిస్‌తో పాటు అతనికి విపరీతమైన భారీ కాయం కూడా వుండేదట. అది ఎంతో తగ్గుముఖం పట్టిందని, ఇప్పుడు తన ఆనందానికి అవధులు లేకుండా వుందని, కరీంకు ధన్యవాదాలు తెలియజేశాడట. పల్లెసృజన బృందం కూడా శ్రీనివాస్‌తో మాట్లాడింది ఈ విషయాన్ని నివృత్తి చేసుకుంది.

పల్లెసృజన పరిచయం చేసిన కరీం సోరియాసిస్‌తో పాటు, కీళ్ళ నొప్పులు, ఉదర సంబంధ వ్యాధులు, ఇంకా ఎంతోమంది రోగుల రుగ్మతలను నయం చేస్తుండటం, అతని ఆర్థిక పరిస్థితి కూడా ఎంతో బాగుపడటం 'పల్లెసృజన'కు ఆనంద దాయకమే కదా! ●

**ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.**




**జాషువా అనుభవాలు:**

వ్యక్తిగతంగా చెప్పాలంటే 'పల్లెసృజన' నిర్వహించిన 18వ చిన్న శోధయాత్ర నాకొక అద్భుతమైన అనుభవాన్ని మిగిలించిందనే చెప్పాలి. ఈ యాత్రలో నన్ను ప్రభావితం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మచ్చుకు ఒకటి చెప్పాలంటే 'బసిరెడ్డిపల్లి' గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కలిసి గడిపిన క్షణాలు నాపైన చెరగరాని ముద్రను వేశాయి. ప్రతి గ్రామంలో గణేశం గారు గ్రామాభివృద్ధికి సూచించిన మార్గాలు, గ్రామస్తులను జాగృతులను చేయటానికి చెప్పే విషయాలు అద్భుతమనే అనాలి. ఒకటా రెండా.... ఎన్ని గ్రామాలు... కాకర్ల, మట్టూరు, రంగాపురం, యాచవరం, వెలగలపాయ.... ఇంకా ఎన్నో.... ఈ యాత్రలో గ్రామస్తులను చూసి మేము ప్రభావితమయ్యాము, మేము చెప్పే విషయాలకు వాళ్ళు ప్రభావితమయ్యారనే చెప్పాలి. మా జట్టు గ్రామస్తులతో పునాది స్థాయి ఇన్నోవేషన్లను గురించి చెప్తూ వుంటే వారు ఎంత ఆసక్తిగా విన్నారో చెప్పలేం. తప్పకుండా వారిలో కూడా ఎవరో ఓ ఇన్నోవేటర్ దాగి వున్నాడు అని అనుకునే తరుణంలో 'మట్టూరు' గ్రామంలో 87 సంవత్సరాల 'పెద్ద కేశవయ్య' గారు తారస పడ్డారు. ఈయన మూత్ర పిండాల్లోని రాళ్ళను కరిగించటానికి గత ఎన్నో సంవత్సరాలుగా సాంప్రదాయ వైద్య పద్ధతినే వాడుతున్నారట. అనేకమందికి చికిత్స చేశారట కూడా. ఆయనను శాలువతో సత్కరించి, సమాజానికి ఆయన చేస్తున్న సేవలకు 'పల్లెసృజన' కృతజ్ఞతలు తెలిపింది.

'వెలగాలపాయ' గ్రామంలో బాబూరావు అనే ఒక రైతు 'పల్లెసృజన' వద్ద వున్న గ్రామ స్థాయి ఇన్నోవేషన్లను చుట్టుప్రక్కల గ్రామాలలో ప్రచారం చేయటానికి ముందుకు వచ్చాడు. ఇది చాలా శుభ పరిణామము. వేర్వేరు వ్యక్తులు, విభిన్న మనస్తత్వాలు వున్న అనేకమంది విజ్ఞులతో కలిసి ఈ శోధయాత్రలో పాల్గొనే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ యాత్రని విజ్ఞానదాయకంగానే కాక, ఆనంద దాయకంగా ఉండేలా నిర్వహించిన నిర్వాహకులకి ప్రత్యేకించి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఈ యాత్రలో నేను నేర్చుకున్న అనేక విషయాలు చిరస్థాయిగా నాతోనే

దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.

ఉండిపోతాయని చెప్పగలను. అద్భుతమైన ఈ అనుభవాన్ని మనసులో దాచుకొని తరువాత యాత్ర ఎప్పుడు ఉంటుందా అని ఆశగా ఎదురు చూస్తున్నాను.

**విశాల్ అగర్వాల్ అనుభవాలు :**

ఏదైనా ఒక స్వచ్ఛంద సంస్థ సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేస్తోందా అని ఆలోచించే సమయంలో నాకు 'పల్లెసృజన' వాళ్ళు శోధయాత్ర రూపంలో చేస్తున్న ఈ కార్యక్రమం నా దృష్టిలో పడింది. వెంటనే పాల్గొనాలని నిర్ణయించుకున్నాను. ఈ యాత్ర నాపైన తీవ్ర ప్రభావం చూపిందనే చెప్పాలి. కొత్త అనుభవాలకోసం వెతికే నాలాంటి 15 మంది పరిచయం లేని ఇతర ఉత్సాహవంతులతో కలిసి మూడు రోజులు గడపటమే ఒక వినూత్న అనుభవం. ఏప్రిల్ నెలలో మండుటెండల్లో ఎప్పుడైనా ఓ చిరుగాలి వీస్తే ఎంత ఆనందంగా వుంటుందో దానికన్నా ఎక్కువ ఆనందం నా తోటి యాత్రీకులతో నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడినప్పుడు ఎక్కువ కలిగింది. ఒక్క క్షణం అనిపించింది.... ఈ ఎండల్లో ఇంట్లో కూర్చునేకన్నా ఇలా బయటికి రావడమే బావుంది అని. నిర్మాణుష్యమైన రోడ్లలో వెన్నెలలో నడిచి వెళుతూ వుంటే ఎంత బావుంటుందో..... అనుభవించిన వారికే తెలుస్తుంది.

మారుమూల పల్లెలలో అపరిచిత గ్రామస్తులతో మాట్లాడుతూ వుంటే వారు ఉత్సాహంగా, ఆశగా వారి కష్ట సుఖాలను మాతో పంచుకుంటూ వుంటే..... అదో గొప్ప అనుభవం. చెప్పాగా..... అనుభవించిన వారికే తెలుస్తుంది. రాత్రుల్లో పాఠశాల ప్రాంగణంలో నక్షత్రాల క్రింద నిద్రపోతూ, ఆరుబయట స్నానం చేస్తూ వుంటే చాలా ఆనందంగా ఉంటుంది. చెప్పాగా ..... అనుభవిస్తే.....





గ్రామస్తులతో కలిసి వాళ్ళు చేసే వ్యవసాయం గురించి, కష్ట నష్టాలను గురించి, వాళ్ళ అవసరాల గురించి, వాళ్ళు రసాయన ఎరువులు కొందరు ఎందుకు వాడుతున్నారు, కొందరు ఎందుకు వాడటం లేదు.... వాళ్ళ నోటినుండే వింటూ వుంటే చాలా బావుంది. గ్రామాలలోని యువతతో మాట్లాడుతూ వుంటే వాళ్ళ కళ్ళల్లో మెరుపులు, వాళ్ళ ఉత్సాహము, ఏదో చేయాలన్న తపన చాలా బావుంది. అలాగే పెద్దలు, వృద్ధులతో మాట్లాడుతూ వుంటే వాళ్ళు తమ చుట్టూ వున్న పరిస్థితులు ఎలా మారిపోతున్నాయో చెప్తూవుంటే పరిస్థితులకు తగ్గట్టు తామూ ఎలా మారిపోతున్నారో చెప్తూ వుంటే చాలా బావుంది.

యాత్ర నిర్వహించిన తీరు బావుంది. ఎక్కడ్నించి ప్రారంభించాలి, ఎక్కడ రాత్రి బస చేయాలి అని చేసిన నిర్ణయాలు చాలా బావున్నాయి. ఇంతకన్నా బాగా చెయ్యటానికి కుదరదేమో! అలుపెరుగకుండా నడుస్తూ, ఎన్నో కొత్త విషయాలు చెప్పిన గణేశం గారితో మా అనుభవం చాలా బావుంది. కొందరు యాత్రీకులు తదుపరి యాత్రలలో ఇలా చేస్తే బావుంటుంది అలాచేస్తే బావుంటుందన్న అభిప్రాయాలు చెప్పినా నాకేమో ఇలా చేస్తేనే బావుంది అనిపించింది.

'జిమ్ రాన్' అనే ఆయన 'నువ్వు ఏ ఐదుగురితో ఎక్కువ సమయం గుడుపుతావో ఆ ఐదుగురి లక్షణాలలో సరాసరి కొన్ని నీకు అంటుకుంటాయి' అన్నారు. ఈ యాత్ర తరువాత నాకు చాలా మంచి లక్షణాలు అంటుకున్నాయి. ●

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**

# ఒక భారతీయ సగటు రైతు కథ

**ధారావాహికం 5వ భాగం**

- చల్లా కృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా.

(గత సంచిక తరువాయి)

కదిలిస్తే ఇంకా రక్తం కారుతునే ఉన్నది. ఇదిక కట్టుకునే వీలు లేదని మొద్దుబారివున్న ఆ చిన్నవేలు ముక్కను త్రుంచివేసి నేనే కట్టుకట్టుకున్నాను. అయితే గోరువరకు విరిగిపోవటం మూలాన కొంత పొడవు తక్కువైంది. వ్రాయటానికి పెద్దగా ఇబ్బంది కలగటం లేదు. పని రోజుల్లో వేలు పుండు మానిపోయింది. అయితే మొదలు పెట్టిన కార్యక్రమం మధ్యలో ఆపి తప్పుకుంటే బాగుండదని గుడి నిర్వహణలోనే ఒక సంవత్సరం పాటు కొనసాగాను. సుమారు పది లక్షల రూపాయలదాకా ఊళ్ళో వసూలు చెయ్యగలిగాను. మేము పెట్టుకున్న పని ఎస్టిమేషన్ 20 లక్షలు. మిగతా డబ్బు రాజకీయ నాయకుల ద్వారా వసూలు చెయ్యాలనుకున్నాము. కానీ ఊళ్ళో ప్రజలు అందుకు అనుకూలించలేదు. అయినా వారిని ఒప్పించి ఎమ్మెల్యే, ఎంపీ లాంటి రాజకీయంగా తిరిగే వారు సహాయం చేస్తామని చెప్పి చెయ్యలేదు. ఆవిధంగా నిధులు సేకరించలేక పోయాము. సగం పనిలోనే గుడి ఆగిపోయింది. నా డబ్బు కొంత ఆ పనిలో ఆగిపోయినట్లు గుడి లెక్కల ప్రకారం తేలింది. అలా మరొక సంవత్సరం కూడా గడిచిపోయింది.

ఆ క్రమంలో మా చిన్న కొడుక్కి కూడా పెండ్లి చెయ్యటానికి నిర్ణయించుకున్నాను. మా చిన్నవాడు కూడా నాలాగే దేవుడు, ఆధ్యాత్మికత అంటే కొంత మక్కువ.



ధర్మంగా వుండాలనే నా పోలికలు వాడికి ఎక్కువ. మా అమ్మ తరుపు బంధువుల అమ్మాయినిచ్చి వివాహం చెయ్యడం జరగింది.

ఊరి మధ్యలో ఒక స్థలాన్ని కొని అక్కడ ఓ ఇల్లు కట్టాను. చిన్న కొడుకు వివాహంలో కట్నంగా వచ్చిన డబ్బు ఆ కట్టడానికి ఉపయోగ పడింది. ఈ క్రమంలో పెద్దవాన్ని వేరుచేసి వాడి విభాగంగా ఆటోని ఒక ఇల్లు, ఒక కొట్టు వాడికిచ్చి వాడి కాపురం పెట్టించాను. ఊరి మధ్యలో కట్టిన ఇంట్లో చిన్నవాడ్ని వుంచి, కొట్టు నడుపుకుని జీవించటానికి ఏర్పాట్లు చేశాను. మేము భార్యాభర్తలం ఇద్దరం వేరుగా పాత ఇంట్లోనే ఒక గదిలో వుంటున్నాము. ఇప్పుడు నాకు కాస్త రిలీఫ్ వచ్చింది. కాస్త డబ్బుతో కొంత ఉసులుబాటుగానే ఉన్నాను. డబ్బుగా వారికి ఏమీ ఇవ్వలేదు, డబ్బు నాదగ్గరే ఉన్నది. ఈవిధంగా ఒక సంవత్సరం గడిచే సరికి చిన్నవాడు సంపాదించిన డబ్బును, వాళ్ళమ్మ దగ్గర వున్న బంగారం, ఇంకా బంధువుల దగ్గర కొంత అప్పు చేసి ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో సంవత్సరానికి ఒకటికి రెండు రూపాయలు ఇస్తామంటే డిపాంట్ చేశాడని తెలుసుకున్నాను. అందులో చిన్నవాడు బాగా నష్టపోయాడు. అప్పటి వరకు నేను వాడిని పట్టించుకోలేదు. నేను ఓ చిన్న బట్టల కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తూ వుండేవాడిని. అయితే వాడికి నష్టం వచ్చి అప్పుల పాలయిన తర్వాత వాడిని సరిదిద్దటం కోసం వాడి వద్దకు వచ్చి మేము ఉండవలసి వచ్చింది. కరెంటు తయారు చెయ్యాలనే తపన, ఇటు చిన్నవాడి బాకీ తీర్చాలనే బాధ్యత కలిసి మళ్ళీ ధనం సంపాదన వైపు ఆలోచన మళ్ళింది. ఏదైనా డబ్బు సంపాదించగలిగే పెద్ద వ్యాపారం ఏదైనా దొరికితే బాగుండునని ఆలోచించాను.

నాబార్డ్ వాళ్ళ మీటింగ్‌కు హాజరై వారి ఆకర్షణీయమైన సబ్సిడీలకు ఆకర్షించబడి పాల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించడం కోం ఆవులు కొనుక్కొని రావటం, పొలం కౌలుకు తీసుకుని గడ్డి పెంచడం, అందులో పూర్తిగా నష్టపోయి నేను కూడా అప్పుల పాలవటం జరిగింది.

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది.**
**ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్ములను గొప్పవాళ్ళను చేస్తుంది.**

ఆ క్రమంలోనే కపిల్ చిట్‌ఫండ్స్ వారివద్ద దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ 2 లక్షల పదివేల రూపాయలు కావాలని కోరటం, వారు పేచీ పెట్టి డిపాజిట్‌లో సగం మాత్రమే ఇచ్చి, నీవు ముందుగా డబ్బు కావాలంటున్నావవు కనుక నీకు వచ్చేది అంతే అని నన్ను మోసం చెయ్యటం, వారిపై లోక్ అదాలత్‌లో కేసు వెయ్యటం జరిగింది.

ఈ క్రమంలోనే నాకు న్యాయం ఎక్కడ దొరుకుతుందా అని, నా పరిస్థితి ఎవరికి చెప్పాలి, ఎలా ఈ అప్పుల నుండి బయట పడాలి, అప్పుల వాళ్ళు వత్తిడి చేస్తున్నారు. వాళ్ళ భయం వాళ్ళది, వాళ్ళు కేవలం వడ్డీ కోసమే నాకు అప్పుగా ఇచ్చియున్నారు. నానుండి డబ్బు రాబట్టడానికి వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేస్తున్నారు.

ఈ క్రమంలో వినియోగదారుల ఫోరం గుంటూరు వాంని కలవటం జరిగింది. వారివద్ద నుండి సరైన సమాధానం లేదు. ఆ తర్వాత జన విజ్ఞాన వేదిక వారిని కలిశాను. వారివద్దనుండి కూడా సరియైన సమాధానం రాలేదు. గుంటూరులోని ట్రిబులెక్స్ కంపెనీ వారి దగ్గరకు వెళ్ళి విద్యుత్‌ను తయారు చెయ్యటానికి నావద్ద ఒక కొత్త ఐడియా ఉన్నది మీరు పెట్టుబడి పెట్టగలిగితే ఆ దిశగా ప్రయోగాలు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేటట్లు విద్యుత్‌ను తయారు చేస్తాను అని చెప్పాను. అయితే ఎవరైనా ప్రయోగాలు అంటే అది సక్సెస్ అవుతుందో లేదో, అనవసరంగా డబ్బును కోల్పోవలసి వస్తుందేమోనని ఆలోచిస్తారు కదా. అదే వాళ్ళూ ఆలోచించారు. అయితే నా ఐడియాను స్వాగతించారు. కానీ మేమూ ఆలోచించుకోవాలి, అప్పుడే ఓ నిర్ణయానికి రాగలము అని అన్నారు.

ఈ క్రమంలోనే ఆధ్యాత్మికంగా ఆలోచనలు పెల్లుబికినాయి. ఆ దిశగా చాలా లోతుగా వెళ్ళాలని ప్రయత్నించడం, తైత్తరీయ సిద్ధాంతకరర్త సుభోదానంద గారిని కలవాలని తాడిపత్రి వెళ్ళటం, అక్కడ నాలుగైదు రోజులు ఉన్నాగానీ ఆయన్ని కలిసి మాట్లాడలేక పోవటం జరిగింది. వస్తూ బ్రహ్మంగారి మఠం యాగంటి పుణ్య క్షేత్రాలు దర్శించడం అక్కడే 'సృష్టి రహస్యం' అనే పుస్తకాన్ని వ్రాయటానికి పూనుకోవటం జరిగింది. ఆ తర్వాత ఏవిధంగా ఈ అప్పుల బాధనుండి బయట పడాలి? ఏమీ తోచడం లేదు. తిరుపతి వెంకన్న స్వామికి మొక్కి నా విద్యుత్ ఐడియా సక్సెస్ అయి నాకు డబ్బు వచ్చి నా అప్పులన్నీ తీర్చగలిగితే, ఆ తర్వాత మిగిలిన డబ్బు నీ హుండీలో వేసాస్తనని మొక్కుకోవడం జరిగింది. అదీ ఒక సంవత్సర కాలంలో జజరగాలని, 8-2-2015న మొక్కుకున్నాను. 8-2-2016 కల్లా ఈ పని అయ్యేట్లు చూడమని ఆయనకు మొక్కి దీక్షను పాటిస్తున్నాను. చెప్పుల్లేకుండా నడవటం, గడ్డం, జుట్టు పెంచుకుని కత్తిరించుకోకుండా ఉండటం, బ్రహ్మచర్యం, మితాహారం, సాత్విక భోజనం.... ఇవీ నియమాలు. చూద్దాం ఏం జరుగుతుందో, ఎలా ఈ సమస్యను పరిష్కరిస్తాడో ఈ నా అప్పుల సమస్యను అని ఎదురు చూస్తూ భగవంతుడి నిర్ణయంపై ఆధారపడి జీవనం సాగిస్తూ 'పల్లెసృజన' హైదరాబాద్ వారిని కలవటం జరిగింది.

ఏది ఏమైనప్పటికీ కొంత సత్సాంగత్యం నాకు ఈవిధంగా ప్రాప్తించటం, కొంత ఊరట నాకు కలుగుతున్నది. భగవంతుని నిర్ణయం ఏవిధంగా ఉన్నప్పటికీ సంతోషంగా స్వాగతిస్తాను. ఎన్ని కష్ట నష్టాలు, అవమానాలు ఎదురైనప్పటికీ సహనంతో ఎదుర్కొనటానికి పూర్తిగా భగవంతుడు నాకు శక్తినిస్తున్నాడు.

భగవంతుని ప్రత్యక్షంగా నా జ్ఞాన నేత్రంతో చూడగలుగుతున్నాను. ఆయనతో చర్చించ గలుగుతున్నాను. కానీ ఆత్మగా నా స్థానాన్ని నేను పొందలేక పోతున్నాను. ఇంకా కర్మబంధం నాకు అడ్డుగా ఉన్నది కాబోలు. ఆత్మ శక్తిని నేను పుంజుకోలేకపోతున్నాను. అందుకోసమే ఆ శక్తిని వినియోగంలోకి తెచ్చుకోవటం కోసమే ప్రయత్నం కొనసాగిస్తున్నాను. నేను ఇంకా పూర్తిగా అజ్ఞానం నుండి బయట పడలేదు. అందుకే ఆత్మగా నా స్థానాన్ని నేను సంపాదించుకోలేక పోతున్నాను.

అది భగవంతుడి చేతిలోనే ఉన్నది. ఎప్పుడు ఏవిధంగా నన్ను, నా స్థానానికి చేరుస్తాడో వేచి చూడవలసి వున్నది. మాయా జగతిలో దేవుని కృపతో ఆత్మయోగ సాధన చేయుచున్న జీవుడు..... ఈ సంఘటనలు కేవలం నా జీవితంలోని కొంత భాగం మాత్రమే. ఇంకా ఎంతో జీవితం ఈ పుస్తకంలో వ్రాయలేక పోయాను.

●

ఈ ధారావాహికలో వెలిబుచ్చిన అభిప్రాయాలు రచయితకు సంబంధించినవి. 'పల్లెసృజన'నకు ఎటువంటి బాధ్యత లేదు. - ఎడిటర్

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

చిన్నారుల జ్ఞానం

# ‘ఇగ్నైట్-2015’ లో బహుమతి పొందిన చిన్నారుల జ్ఞానాలు




**లిప్సా ప్రధాన్**
9-10 తరగతి,
బర్గర్, ఒరిస్సా

నేలమీద రాలిన ఇప్ప పూలను సేకరించే పరికరం




**నీలేశ్ రాజ్**
9-10 తరగతి,
పాట్నా, బీహార్

స్టౌలో గ్యాస్ లీక్‌ను పసిగట్టే లైటర్




**శాపిర్ డెబ్బర్మ & క్లిషన్ డెబ్బర్మ**
11-12 తరగతి,
ధలాయ్, త్రిపుర

తక్కువ ఖర్చుతో గడ్డి, పిచ్చి మొక్కలను కత్తిరించే పరికరం




**దివ శర్మ**
11-12 తరగతి,
ఢిల్లీ

పశువులలో వత్తిడిని నియంత్రించే పరికరం




**జనమేజయ్ సింగ్ రాథోడ్**
11-12 తరగతి,
బెంగుళూరు, కర్నాటక




**జస్‌ప్రీత్ కౌర్**
9-10 తరగతి, జలంధర్, పంజాబ్

జ్వర తీవ్రతను రంగులలో తెలిపే థర్మామీటర్




**ఆది కుమార్**
8వ తరగతి,
బెల్గామ్, కర్నాటక

విరిగిన చేతికి ఊతమిచ్చే ఉపాయం

**దీపాంకర్ దాస్**
11-12 తరగతి,
అండమాన్, అండమాన్ & నికోబార్

సౌరశక్తితో పనిచేసే పప్పుదినుసుల నూర్పిడి యంత్రం




**సౌరవ్ దే**
9-10 తరగతి,
వెస్ట్ సింగభమ్, జార్ఖండ్

లక్కను శుద్ధి చేసే యంత్రం




**నేహా**
11-12 తరగతి,
జలంధర్, పంజాబ్

సహజ/ కృత్రిమ పద్ధతిలో మాగిన పండ్లను గుర్తించే పద్ధతి




**ఆర్. ఎలక్కియ & ఆర్. పవిత్ర**
9-10 తరగతి,
ఈరోడ్, తమిళనాడు

వికలాంగులకు అనువైన మగ్గాలు




**హదస రొంగ్మెయి**
9-10 తరగతి,
దీమారపూర్, నాగాలాండ్

కళ్ళద్దాలలో సూక్ష్మదర్శిని





**రిషబ్ మల్లిక్**
9-10 తరగతి,
కలకత్తా, పశ్చిమ బెంగాల్

ప్రయాణాల్లో బరువుకు తగ్గట్టుగా చార్జీలు

# 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
# బహుమతి పొందిన ఇన్నోవేషన్లు - ఇన్నోవేటర్ల వివరాలు

5వ భాగం




అనువాదం : జె. శశిమోహన్

**రాష్ట్రీయ పురస్కారం (కర్నాటక) :**
**తక్కువ ఖర్చులో బోర్‌వెల్ స్కానర్**
**గిరీష్ భద్ర గోండ్, బీజాపూర్, బెంగుళూరు, కర్నాటక :**



వ్యవసాయం చేసే రైతులకి బోరు బావుల్లో నీళ్ళు ఉన్నాయా? ఎన్ని వున్నాయి? ఎటునుంచి ఊట ఉంది? ఎన్ని నీళ్ళు తోడుకోవచ్చు? ఆ నీరు మనం వేసే పంటకు సరిపోతుందా? అన్న వివరాలు తెలిసి వుంటే వ్యవసాయంలో సగం సమస్య తీరిపోయినట్లే. ఇది తెలుసుకునే పద్ధతి కనుగొన్న 35 సంవత్సరాల గిరీష్ భద్ర గోండ్ స్వతహాగా బీజాపూర్‌లో ఎలక్ట్రీషియన్. బోరు వెల్ లోకి కెమరాను దింపి, పై వివరాలను కనుగొనటానికి అత్యాధునిక పద్ధతులు గల స్కానర్‌ను రూపొందించాడు.

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన గిరీష్‌కు చిన్నప్పటినుంచి ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలను రూపొందించటంలో మక్కువ ఎక్కువ. ఈ లక్షణం బహుశా ఇతనికి తండ్రి వద్దనుంచి వచ్చి వుంటుంది. ఎందుకంటే ఆయనా వ్యవసాయదారుడే అయినా ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ మోటార్లను, వాహనాలను రిపేరు చేస్తూ వుండేవాడు. ఐదుగురు సంతానంలో చిన్నవాడైన గిరీష్ చిన్నతనం నుంచి తండ్రికి ఎలక్ట్రానిక్ వస్తువులు, సినిమా ప్రొజెక్టర్లను రిపేరు చేయటంలో సహాయపడుతూ వుండేవాడు. 7వ తరగతిలో వుండగానే 'ఎలక్ట్రానిక్స్ ఫర్ యు' అనే పత్రిక చదవడం

కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.



ప్రారంభించి, ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లపై మంచి అవగాహన కల్పించుకున్నాడు. 1996 నుంచి సర్క్యూట్‌లపై ప్రయోగాలు చేయటం ప్రారంభించాడు కూడా. ఇతను మొదట చేసిన ఇన్‌ఫ్రా రెడ్ సెన్సార్ విజయవంతమైంది. 2005లో ఉత్సాహంగా మిత్రుల ఆర్థిక సహాయంతో 'ఓరా లైట్ సేవర్' అనే పరికరం కనుగొనాలని ప్రయత్నం చేశాడు. ఆలస్యం అవటంతో మిత్రులు తమ వాటా ఇచ్చేయమని తొందర చేశారు. తనవద్దనున్న వస్తువులన్నింటిని అమ్మేసి వారి అప్పు తీర్చేశాడు.

ఆలోచనలైతే ఉన్నాయి కానీ, చేతిలో డబ్బు లేదు. ఒక్క క్షణంలో ఆత్మహత్య చేసుకుందాం అనుకున్నాడు. కానీ నిలదొక్కుకుని తన ఆలోచనలకి ఒక రూపం అందించే శ్రేయస్కరమని అనుకున్నాడు. తనకున్న వ్యవసాయ పరిజ్ఞానం, దానికి తోడు ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానంతో వ్యవసాయ దారులకు పనికి వచ్చే పనిముట్లు కనుగొనాలని ప్రయత్నించాడు. ఒక్కటొక్కటిగా .... పక్షులను పారద్రోలే పరికరం, కరెంటు వాడకం తక్కువ చేసే పరికరాలు, సెల్‌ఫోన్‌తో నీటి పంపును ఆన్ చేసే పరికరం, సౌర శక్తితో పనిచేసే మోటారు, బోర్‌వెల్ స్కానరు లాంటివి ఎన్నింటినో రూపొందించాడు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకి వారి సైన్సు ఇంజనీరింగ్ ప్రాజెక్టులలో సహాయం చేసేవాడు. 2011లో వివాహం చేసుకున్న ఇతనికి ఒక కుమారుడు ఉన్నాడు.

2006 నుంచి బీజాపూర్ పరిసర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. బోరు బావులలో నీరు తగ్గిపోయింది. దాంతో రైతులు బోరు బావిలో నీరెంత వుంది? మోటారు పెట్టాలా వద్దా? అన్న సందిగ్ధంలో పడిపోయారు. మొదట్లో గిరీష్ 'సౌండ్ రిఫ్లెక్షన్ పద్ధతి' ద్వారా భూమిలో నీరు ఎక్కడ వుందో చెప్పేవాడు. తరువాత ఈవిధంగా కాదు, ఇంకా అధునాతన శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించి ఖచ్చితంగా చెప్పే ప్రయత్నం చేయాలని నిశ్చయించుకొని దానికి భూమి లోపల పరిస్థితులను తెలుసుకోవటానికై మామూలు కెమెరాను ఉపయోగించాడు. అది అనుకున్నంత మంచి ఫలితాలను ఇవ్వలేదు. భూమి లోపల రాళ్ళు, నీటి ఊటలు, నీరు ఎటునుంచి ఎటు పారుతోంది లాంటి వివరాలను తెలుసుకోవటమే కాకుండా భూమి లోపల ఉండే వత్తిడికి, వేడికి తట్టుకొని పని చేసే ప్రదేశంలో కాక, దూరం నుంచైనా ఈ వివరాలను తెలుసుకునే 'బోర్ వెల్ స్కానర్' తయారు చేయాలని నిశ్చయించుకున్నాడు. చాలా శ్రమపడి, ఎంతో ఖర్చు చేసి 2006లో మొదటి పరికరం తయారు చేసి, దానిలో మార్పులు చేర్పులు చేసుకుంటూ, 2009లో తాను అనుకున్న విధంగా పనిచేసే స్కానర్‌ను రూపొందించాడు. దానితో తన గ్రామంలో అనేక బోర్‌బావులను పరీక్షించి, బావిలోని నీటి పరిస్థితిని వివరంగా తెలుపగలిగాడు. అందరూ ఎంతో సంతోషించారు. క్రమంగా ప్రక్క గ్రామాలు, తాలూకా, పరిసర ప్రాంతాలకు విస్తరించి, ఉత్తర, పశ్చిమ కర్నాటకలలో దాదాపు 300 మంది రైతులకు తన సేవలను అందించాడు. ఈ క్రమంలో తాను తన స్కానర్‌ను ఇంకా అభివృద్ధి చేస్తూనే ఉన్నాడు.



**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

ఇతని పద్ధతి ప్రకారం బోరు బావిలోకి చిన్న గొట్టం రూపంలో వున్న కెమరాను దింపుతాడు. అది ఎంత లోతులో నీరు వుంది? ఎంత ప్రమాణంలో వుంది? నీరు ఎటునుంచి ఎటువైపుకు పారుతోంది లాంటి విషయాలను తెలపటమే కాకుండా, భోమిలోపల వత్తిడిని, వేడిని కూడా తట్టుకునేలా రూపొందించాడు. దీని సహాయంతో రైతులు తల బోరు బావిలో వున్న నీటి పరిమాణానికి ఎంత శక్తిగల మోటారు వేసుకోవచ్చు, ఏ రకమైన పంటలను వేసుకోవచ్చు అన్న విషయాలను నిర్ణయించుకోవటం సులభమవుతుంది. సుమారు ఒకటిన్నర కిలోల బరువున్న ఈ పరికరం భూమిలోకి 600 అడుగుల లోతు వరకు పంపించి, పైన ఎల్.సి.డి. స్క్రీన్‌పైన స్పష్టంగా భూమి లోపలి చిత్రాలను చూసే విధంగా రూపొందించుకున్నాడు.

తానుఅందించే సేవలకి గిరీష్ కేవలం రూ. 1500 మాత్రమే తీసుకుంటాడు. రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు తమ పరిశోధనలకై ఇతనివద్ద నుండి ఒక స్కానర్‌ను కొనుగోలు చేశారు. పశ్చిమ, దక్షిణ ప్రాంత 'సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు' వారు ఎన్.ఐ.ఎఫ్.కి ఈ పరికరం గురించి సిఫారసు చేస్తూ భూగర్భ జలాల విషయంలో, ప్రత్యేకించి బోరు బావుల్లో నీటిని గురించి రైతులకి ఈ పరికరం చాలా ఉపయోగ కరంగా ఉంది అని సిఫారసు చేస్తూ, ఈ పరికరాన్ని ఇంకా అభివృద్ధి చేసే అవకాశం ఉందని సూచించారు.



**రాష్ట్రీయ పురస్కారం (కేరళ) :**
**వైర్‌లెస్ కరెంటు టెస్టర్**
**సి.ఎస్. రుషీకేశ్, అలపుజ, కేరళ :**

ప్రమాద వశాత్తు హై ఓల్టేజి కరెంటు తీగలని తాకటం వలన అనేక మరణాలు సంభవిస్తూ వుంటాయి. ప్రత్యేకించి విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులకి ఫలానా వైరులో కరెంటు ప్రసరిస్తున్నదా లేదా అని తెలుసుకోవటం చాలా ముఖ్యం. తక్కువ ఓల్టేజి అయితే సాధారణ టెస్టర్‌ను ఉపయోగించి తెలుసుకోవచ్చు. కానీ, హై ఓల్టేజీలలో కరెంటు పరీక్షించడానికి ఎలాంటి పరికరం లేదు. 40 సంవత్సరాల వయసుగల రిషీకేశ్ 11 కిలో వాట్ల శక్తి గల కరెంటును 11 మీటర్ల దూరం నుండి తెలుసుకోగల పరికరాన్ని రూపొందించాడు. దీంతో కరెంటు స్తంభాలను ఎక్కవలసిన అవసరం లేకుండానే అందులో కరెంటు ప్రవహిస్తుందా లేదా అన్న విషయాన్ని తెలుసుకోవటంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లలో, భూగర్భ విద్యుత్ తీగలలోని కరెంటు పరిస్థితిని కూడా తెలుసుకోవచ్చు.

నదీ సముద్ర జల ప్రాంతాల్లోని ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు రిషీకేశ్. ఇతని తండ్రి వ్యవసాయంతో పాటు చేపలు పట్టడమే కాక, రాష్ట్ర నీటి రవాణా శాఖలో కూడా పని చేసేవాడు. ఇతని తల్లి గృహిణి, అక్క మాత్రం తండ్రితో పాటు అదే శాఖలో పని చేసేది. పాఠశాలలో చదువుకునే టప్పుడు తోటి విద్యార్థులు రేడియోలు/ ట్రాన్సిస్టర్లు వాడటం గమనించాడు. ఆ వయసు లో ఆ చిన్న పెట్టెలలోకి శబ్దాలు ఎక్కడినుంచి వస్తోందని ఆశ్చర్య పడేవాడు. కుతూహలంతో ఇంట్లో వున్న ట్రాన్సిస్టరుతో ప్రయోగాలు చేశాడు. ఇంట్లో వున్న ఏకైక వినోద సాధనం చెడగొట్టినందుకు తల్లి కోప్పడింది. ఒకసారి బల్లో టెలిఫోన్ వైరుకి స్పీకర్‌ను కనెక్ట్ చేసి ప్రయోగం చేయబోగా ఫోన్ మ్రోగినప్పుడు చిన్నగా కరెంట్ షాక్ కొట్టింది. కరెంటు షాకుతో అదే నా మొదటి అనుభవం అంటాడు రిషీకేశ్. ఆ తర్వాత చిన్న వయసులోనే ఎలక్ట్రానిక్స్ గురించి, కరెంటు గురించి తనకు దొరికిన పుస్తకాలనల్లా చదివి అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాడు. మొదట సరదాగా మొదలు పెట్టిన ఈ పని తీవ్రమైన ఆకాంక్షగా మారింది.



అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.

ఎలక్ట్రానిక్స్‌మీద తనకున్న మక్కువతోటి ఇంటర్మీడియట్‌లో చేరిన రిషీకేశ్‌కి ఈ ఎలక్ట్రానిక్స్ కేవలం ఒక చిన్న అంశంగా మాత్రమే చెప్తున్నారని, నిరుత్సాహపడి ఇలా కాదని ఇంటర్‌మీడియట్ తరగతులలో కాక, డిగ్రీ స్థాయిలో ఎలక్ట్రానిక్స్ చెప్పే తరగతులలో కూర్చునేవాడు ! ఇదీ ఎక్కువ కాలం సాగలేదు. చదువు మానేసి ఎలక్ట్రానిక్ రిపేరు షాపులో చేరిపోయాడు. అక్కడా ట్యూబులు, చౌక్‌లు మొదలైన ఎలక్ట్రానిక్ పరికరాలను మరమ్మతు చేయడం నేర్చుకున్నాడు. మనసులో మాత్రం ఏదో ఓ కొత్త పరికరం కనుగొనాలన్న తపన తీవ్రంగా ఉండేది.

ఒకసారి విద్యుత్ శాఖలో పనిచేసే ఇతని మిత్రుడు లైన్‌మీద పనిచేస్తూ వుండగా 250 వాట్‌ల విద్యుత్ పొరపాటున 11 కిలో వాట్ల లైన్లోకి వచ్చి ఆ ప్రమాదంలో మరణించాడు. ఈ విషయం తెలిసిన రిషీకేశ్ ఇలా జరగకుండా ఉండటానికి నివారణోపాయం వెతకాలని నిశ్చయించుకున్నాడు. సాధారణంగా ఇంట్లో వాడే పరికరాల్లో కరెంటు ప్రవాహాన్ని కనిపెట్టడానికి సాధారణ టెస్టర్ వాడుతూ వుంటాము. కానీ, రిషీకేశ్ 11 కిలోవాట్ల శక్తి వున్న కరెంటును 11 మీటర్ల దూరం నుంచే కనిపెట్టే ఎక్కడికైనా తీసుకు వెళ్ళగలిగేలా వుండే తేలికైన పరికరాన్ని రూపొందించాడు. ఇది ట్రాన్స్‌ఫార్మర్లలోనే కాక, భూగర్భంలో వుండే కేబుల్స్ నుండి కూడా విద్యుత్ ప్రవాహాన్ని కనిపెట్ట గలదు. కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డు వారు ఈ పరికరాన్ని అనేక విధాల పరీక్షించి, చాలా ఉపయోగ కరమైనదని కితాబునిచ్చారు.

రుషీకేశ్ తక్కువ కరెంటు వాడండి అనే ఆలోచనని ఒక ఉద్యమంగా తన ప్రాంతంలో వ్యాప్తి చేస్తున్నాడు.



పర్యవసానంగా మొత్తం కేరళ రాష్ట్రంలో కరెంటు కోతలు ఉన్నా, ఇతని గ్రామమైన 'మొహమ్మ'లో మాత్రం 24 గంటలు కరెంటు వస్తోంది. ఇప్పుడితను కరెంటు పరిమితంగా వాడండి అన్న విషయంపై అనేక పరిసర గ్రామాల్లో పోలీస్ ట్రైనింగ్ కేంద్రాలో, పాఠశాలలు, కళాశాలలు, స్వయం సహాయక బృందాలద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాడు. ఇంతే కాక ఇతను మాదక ద్రవ్యాలకి వ్యతిరేకంగా కూడా ప్రజలను జాగృతం చేస్తున్నాడు. ఇతను చక్కగా పాడగలడు, చాలావరకు ప్రచారాలను పాటల రూపంలోనే చేస్తుంటాడు. ఇన్ని చేశావు, ఇప్పుడేం చేస్తున్నావయ్యా అని అడిగితే ఎక్కడైనా కరెంటు తీగ తెగిపోతే దానంతట అదే కరెంటు నిలిచిపోయే పద్ధతిపై పని చేస్తున్నాను అంటాడు రుషికేశ్.

**ప్రోత్సాహక బహుమతి :**

**జాజికాయ వలిచే యంత్రం**

**వి.ఆర్. సచ్చిదానందం, ఎర్నాకులం, కేరళ :**



సాంప్రదాయంగా జాజి కాయలను వలుచడానికి సుత్తులను ఉపయోగించడం, లేదా చేతితో పనిచేసే పటకార లాంటి పరికరాలను ఉపయోగిస్తూ వుంటారు. లేదా కొంత ఎత్తునుంచి ఒక్కొక్క కాయను క్రిందకు వేస్తూ వుంటారు. అది కూడా పగలకపోతే మళ్ళీ మళ్ళీ వేస్తూ వుంటారు. ఈ పద్ధతుల వలన చాలా శ్రమ, సమయం, ఖర్చు అవుతూ వుంటుంది. వలిచిన జాజికాయలకి రెండింతల ధర వచ్చినా ఆ వచ్చిన లాభం కూలీలకే సరిపోతూ వుంటుంది. 72 సంవత్సరాల సచ్చిదానందం జాజికాయలు వలవటానికి వీలయ్యే ఒక యంత్రాన్ని కనుగొని ఈ సమస్యకి పరిష్కారం చూపించాడు. ఈ యంత్రం రెండుదఫాలుగా వాడటం వలన గంటకి 75 కిలోల వరకు జాజికాయలు 90 శాతం నాణ్యతతో వలిచి రైతులకి 40 నుండి 50 శాతం అధిక లాభాలను అందించ గలుగుతోంది.

చిన్నప్పటినుంచి సచ్చిదానందంకి వ్యవసాయ మన్నా, వ్యవసాయ పనిముట్లు అన్నా ఉత్సుకత ఎక్కువ.

**నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.**





గోడలపై అలంకారం చేయటము, మట్టితో బొమ్మలు చేయడము, చెక్క బొమ్మలను చేయటము ఇతనికి ఎంతో ఉత్సాహం. 72 సంవత్సరాల సచ్చిదానందం వారి వారి అవసరానికి తగ్గట్లుగా రైతులకు పనికి వచ్చే విధంగా ఇప్పటివరకు దాదాపు 50 రకాల యంత్రాలు, పనిముట్లు తయారు చేసి ఇచ్చాడు. వీటిలో పొలంలో ఉల్లి కోసే యంత్రం, పొడి చేసే (పర్వరైజర్) యంత్రాలు, నూనె తీసే యంత్రాలు, ప్యాకింగ్ యంత్రాలు, అప్పడాలు తయారు చేసేవి, చిప్స్ చేసేవి లాంటి ఎన్నో రకాల యంత్రాలను తయారు చేశాడు. ఏ పటాటోపాలు లేకుండా చాలా సాధారణంగా జీవించే సచ్చిదానందం సాధారణ మనుషులకు, రైతులకు ఉపయోగ పడి, వారికి లాభాన్ని చేకూర్చే పరికరాలు కనుగొనటానికే తన సృజనాత్మకతను ఉపయోగించడంలో తనకెంతో ఆనందం వుంది అంటాడు.



**ప్రోత్సాహక బహుమతి :**
**బిల్వ కాయలను పలిచే యంత్రం**
**సచిన్ సుభాష్ జగ్‌తాప్, జల్గావ్, మహారాష్ట్ర :**

బిల్వ కాయలను సాధార ణంగా మొలలు, ప్రేవు సంబంధిత వ్యాధులు, నెత్తురు విరోచనాలు, బంక విరోచనాలు, అజీర్తి, కడుపు ఉబ్బరం, వ్రణాలు, నులి పురుగులు మొదలైన ఆరోగ్య సమస్యలకి ఆయుర్వేద ఔషధంగా వాడుతూ వుంటారు. బిల్వ కాయ నుండి గుజ్జును తీయటానికి సాధారణంగా దాన్ని పగల గొట్టడమే తప్ప వేరే ప్రత్యేకమైన మార్గమేమీ లేదు. కానీ, ఈ ప్రక్రియలో బిల్వ నూనె చేతికి అంటుకుని చేతులు పొక్కిపోయే ప్రమాదముంది.

మహారాష్ట్రలోని జల్గావ్ ప్రాంతానికి చెందిన సచిన్ బిల్వ కాయలను పగలగొట్టడానికి చేతితోనే పనిచేసే ఓ సులభమైన యంత్రాన్ని కనుగొన్నాడు. ఈ యంత్రంలో బైటికి కనిపించే విధంగా ఫైబర్ గ్లాస్‌తో చేసిన ఒక భాగంలో కాయను పెట్టి చేతితో ఒక లీవర్‌ను నొక్కటం ద్వారా కాయను ముట్టుకోకుండా దాన్ని పగలగొట్టే వీలుంటుంది. ఈ పద్ధతిలో గంటకి 150 వరకు కాయలను పగలగొట్టవచ్చు. మోటారుతో పనిచేసే యంత్రం ద్వారా గంటకి 400 కాయల వరకు పగలగొట్టవచ్చు. దీనిని ఉపయోగించిన వారు చేతులకి ఏ హానీ లేకుండా, బిల్వ కాయల గుజ్జును సేకరించటానికి ఉపయోగ కరంగా వుంటుంది అన్నారు.



**ప్రోత్సాహక బహుమతి :**
**చేతితో నడిపే కలుపు తీసే యంత్రం**
**కడివెండి మహిపాల్ చారి,**

మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.



రైతులకి ప్రస్తుతం ఎద్దులు మనుషులతో పని చేయించటం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్యలకి పరిష్కారంగా పంట పొలాల్లో అంతర సేద్యాలకు, కలుపు తీయటానికి ఉపయోగ పడే విధంగా 5 హార్స్‌పవర్‌ల డీజిల్ ఇంజన్ సహాయంతో ఒకే మనిషి చేతితో తోసుకుంటూ పనిచేసే విధంగా ఒక యంత్రాన్ని రూపొందించాడు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాకు చెందిన మహిపాల్ చారి. చిన్న ట్రాక్టరు లాగా పనిచేసే ఈ యంత్రంతో గంటకి అర ఎకరం పొలాన్ని దున్నటానికి కాని, కలుపు తీయటానికి కానీ కేవలం అర లీటరు డీజిలు మాత్రమే ఖర్చవుతుంది. దీన్ని ఇరువాలు దున్నటానికి, విత్తనాలు విత్తటానికి, ఎరువులు, క్రిమి సంహారక మందులను వేయటానికి, బోదెలు చేయటానికి కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేకించి ఎక్కువ ఖర్చు పెట్టుకోలేని చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**ప్రోత్సాహక బహుమతి :**

**కర్రపెండలం తరిగే యంత్రం**

**జె.ఆర్. ధనరాజ్ మరియు కె. మణి, నమక్కల్, తమిళనాడు:**





కర్రపెండలం ను ఆహార పదార్థంగానే కాక, ఔషధాలకు కూడా విరివిగా వినియోగిస్తూ వుంటారు. దీనిని ముక్కలు చేయటం కొద్దిగా శ్రమతో కూడుకున్న పని. దీన్ని సులువుకా కత్తిరించడం కోసం ధనరాజ్, మణిలు ఒక యంత్రాన్ని రూపొందించారు. ఈ యంత్రాన్ని ఎక్కువ మోతాదులో కాయగూరలు తరగటానికి కూడా ఉపయోగించుకోవచ్చు. 50 కిలోల బరువుండే ఈ పరికరం గంటకి 200 కిలోల పెండలాన్ని లేదా 100 కిలోల కూరగాయలను సుమభంగా తరగటానికి వీలవుతుంది. ఈ యంత్రం ప్రత్యేకత ఏమిటంటే దీనిని కరెంటుతోను, ఆయిల్ ఇంజన్‌తోను లేదా సైకిల్ తొక్కడం ద్వారా కూడా పని చేయించుకోవచ్చు.



**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**



'లెప్చా' తెగ జీవిస్తున్న (ఉత్తర సిక్కిం) భూమిలో

# 34వ జాతీయ శోధయాత్ర

జనవరి 28 నుండి ఫిబ్రవరి 3, 2015 తేదీలలో ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యం వున్న "జోంగు" పర్వత ప్రాంతాలలో గొప్ప సాంస్కృతిక సంపద, పురాతన సాంప్రదాయ జ్ఞానం మేళవించిన 'లెప్చాలు' నివసించే "ఉత్తర సిక్కిం" ప్రాంతంలో 34వ శోధయాత్రను హనీబీ బృందం చేపట్టింది. ఈ వారం రోజుల యాత్రలో యాత్రీకులు 58 వార్డులలోని 12 గ్రామాలను సందర్శించటానికి 110 కి.మీ. ప్రయాణించారు. ఈ ప్రయాణంలో వారి అనుభవాలను ఈ క్రింద వివరిస్తున్నాము.

పర్వత ప్రాంతం... కరెంటు సరిగా ఉండదు.... ఆకాశం మేఘావృతమై వుంటుంది.... అప్పుడు మీ సెల్ ఫోన్ ఛార్జి చేసుకోవాలంటే ఎలా? మనం ఆలోచిస్తూనే ఉన్నాం, కానీ ఉత్తర సిక్కిం పర్వత ప్రాంతాల్లో నివసించే 'మాయల్ లెప్చా' అనే గ్రామీణ బాలుడికి ఒక మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. కుళాయిలో నీళ్ళు వస్తూవుంటే, ఆ నీటి ధారకి ఒక చిన్న జనరేటర్ అమరిస్తే ఉత్పత్తి అయ్యే కరెంటుతో సెల్‌ఫోన్ ఛార్జి చేసుకోవచ్చు కదా! అన్నాడు.

ఇలాంటి ఆలోచనే బీహార్‌లో చాలా సంవత్సరాల క్రితం ఒక పిల్లవాడు చెప్పాడు. దానిని గురించి మాయల్‌కి తెలియదు. అయినా స్థానికంగా వున్న ఒక సమస్యకి తనదైన శైలిలో పరిష్కారం కనుగొనే ఆలోచన చేశాడు. అతని ఆలోచనకి మెచ్చి 'సృష్టి' సంస్థ వారు అతని ఆలోచన కార్యరూపం దాల్చటానికి కొంత ధనసహాయం చేసి ప్రోత్సహించారు. అతనికెంతో ఉత్సాహం వేసి, పక్కన వున్న 'బోర్' గ్రామానికి శోధయాత్రీకులతో పాటు, తన తోటి స్నేహితులతో తోడు వచ్చి మార్గం చూపించాడు.

ఇది శోధయాత్రీకులకి ఎదురైన ఒక చిన్న అనుభవం మాత్రమే. ఈ యాత్రలో మూడు విభిన్న దేశాల నుండి 14 వేర్వేరు రాష్ట్రాల నుండి 77 మంది శోధయాత్రీకులు 28 జనవరి, 2015 నాడు 'జోంగు' పర్వత లోయ ప్రాంతాల్లో యాత్ర ప్రారంభించి, ఎత్తైన కొండలు, లోతుగా వుండే లోయలు, చెట్లు, అడవులు దాటుకుంటూ 58 వార్డులలోని 12 గ్రామాలు సందర్శించటానికి దాదాపు 110 కిలోమీటర్ల ప్రయాణం చేశారు. ఆ ప్రాంతమంతా 'లెప్చా' తెగకు చెందిన వారుంటారు. దీనిని 1960లో రక్షిత ప్రాంతంగా గుర్తించి, సందర్శించ దలుచుకున్న వారు ప్రత్యేక అనుమతి పొందాలని నిబంధన పెట్టారు. యాత్రంతా సహజమైన అడవులు, పాత కాలి బాటల మీదుగా సాగింది.

ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.

సందర్శించిన ప్రతి గ్రామంలోను పిల్లలకి ఆలోచనల పోటీలు, జీవ వైవిధ్య పోటీలు, సాంప్రదాయ వంటల పోటీలుతో పాటు ప్రాంతీయ సాంస్కృతిక ప్రదర్శనలు కూడా జరిగాయి.

'లెప్చా'లు అంటే 'దేవుని బిడ్డలు'. వారు కాంచన్ జంగా పర్వతాన్ని తల్లితో పోలుస్తారు. చాలా సంవత్సరాల క్రితం మహా పండితుడైన 'టింకుంగ్ మేన్ సలోంగ్' అనే ఒకతను ఈ తెగకు ఒక "లిపి"ని తయారు చేసి ఇచ్చాడు. దాన్నే ఇప్పటికీ వాడుతున్నారు. 'లెప్చా' తెగ వారికి వ్యవసాయం ముఖ్య జీవనాధారం. ప్రధానంగా యాలకులు, అల్లం పంటలను కొండ వాలులలో సాగు చేస్తూ వుంటారు. క్రమేణా వర్షాభావం వలన, వాతావరణ మార్పుల వలన యాలకుల దిగుబడి తగ్గిపోవడం అన్నది లెప్చాలకు ప్రధాన సమస్యగా మారుతోంది. మంచు తక్కువగా కురుస్తూ వుండటంతో 'యాపిల్' పండ్ల దిగుమతి కూడా తగ్గుతోంది. పండించిన పంటలకి దగ్గరలో మార్కెట్ లేకపోవటం మరో సమస్య. స్థానిక ప్రజలు ఆర్థికంగా బాగుపడాలంటే గ్రామం నుంచి గ్రామానికి జ్ఞాన మార్పిడియే మార్గమని యాత్రీకులు చెబితే వారంతా మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారు.

ఆ ప్రాంతంలో ఎన్నో సెలయేళ్ళు, కాలువలు పారుతూ వున్నా, నీటిని నిలువ చేసుకోవటానికి చెక్





డ్యాములు కట్టుకోవటం లాంటి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. సాంప్రదాయంగా లెప్చాల ఇళ్ళు 9 స్తంభాలే పునాదులుగా కట్టుకుంటారు. సాధారణంగా ప్రతి ఇంట్లో మూడు గదులు.... వంట గది, నివాస గది, పూజా గది వుంటాయి. ఇళ్ళకి ముఖద్వారం చిన్నదిగా వుంటుంది. ప్రవేశించే ముందు భక్తిగా తలవంచి వెళ్ళాలని అలా కడతారట! తరతరాల నుంచి భూకంపాలకి తట్టుకునే విధంగా కట్టుకున్న ఇళ్ళ మధ్య ఇప్పుడిప్పుడే ఆధునిక కట్టడాలు, ప్రభుత్వం గృహ వసతికై కట్టే ఇళ్ళు వెలుస్తున్నాయి.

పెద్దవాళ్ళు సమస్యలకు అలవాటు పడి బ్రతికేస్తూ వుంటే, యువకులు, పిల్లలు మాత్రం గ్రామాల్లో, చుట్టుప్రక్కల వున్న సమస్యలకి పరిష్కారం కనుగొనాలనే తృష్ణతో వున్నట్టు కనిపిస్తుంది. 'దిక్కు' అనే గ్రమంలో పిల్లల సాంస్కృతిక ప్రదర్శన చాలా బావుంది. అక్కడి పిల్లలు వాళ్ళ ఇళ్ళల్లో చేసుకునే వంటల గురించి, ఆ ప్రాంతంలో జీవ వైవిధ్యం గురించి మాకు వివరించటమే కాకుండా, గ్రామమంతా తిప్పి పెద్దలతో మాట్లాడి, రకరరకాల ఔషధ మొక్కల గురించి వివరించారు. యాత్రీకులకి ఆ పిల్లలలో సృజనాత్మక బీజం పడిందన్న నమ్మకం కుదిరింది. 'పాసింగ్ డాంగ్' అనే గ్రామంలో 'సోరంగ్ లెప్చా' అనే పిల్లవాడు వీధి కుళాయిలకి నీటిని శుద్ధి చేసే ఫిల్టర్లను పెడితే బావుంటుందన్న ఆలోచన చెప్పాడు. ప్రతి పేదవాడు ఖరీదైన ఫిల్టర్లు కొనుక్కోలేడు కనుక వీధి కుళాయిలకి ఈ సదుపాయం కల్పిస్తే బావుంటుంది అన్నాడు. పేదవాళ్ళ ప్రసక్తి వచ్చినపుడు 'జానీ

**అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.**

లెప్చా' అనే పిల్లవాడు పాత రబ్బరు ముక్కలు, వ్యర్థంగా పడేసిన ప్లాస్టిక్ సామాన్లతో పేదవారికి ఉచితంగా చెప్పులు తయారు చేసి ఇస్తే బావుంటుంది కదా అన్నాడు.

'హి గైతాంగ్' సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థి 'లైసంగ్ లెప్చా' అనే పిల్లవాడు ప్రతి పాఠాశాలలో ఒక నోటీసు బోర్డు పెట్టి ముఖ్యమైన సమాచారం దాంట్లో వ్రాసి ఉంచాలి అన్నాడు. వెంటనే యాత్రీకులు ఈ ఆలోచన నచ్చి, హనీబీ నోటీసు బోర్డు ఏర్పాటు చేయించింది. దీనిలో పిల్లల ఆలోచనలు, కొత్త ఇన్నోవేషన్లు, రైతులు చేసే వినూత్న ప్రయోగాలు, సాంప్రదాయ వైద్య వివరాలు అందరికీ అందుబాటులో వుండేలా వ్రాసి వుంచాలని నిర్ణయించారు. ఈ శోధయాత్ర లో జోంగు పర్వత పరిసర ప్రాంతాలలోని గ్రామాల పిల్లలు అద్భుతమైన ఆలోచనలు చెప్పారు. ఆ పిల్లలని సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేసి, కొన్ని మంచి ఆలోచనలని 2015 'ఇగ్నైట్' పిల్లల ఆలోచనల పోటీకి పంపాలని నిర్ణయించడం జరిగింది.

యాత్రీకులు సందర్శించిన ప్రతి గ్రామంలో జీవ వైవిధ్య పోటీలను నిర్వహించగా అక్కడి పిల్లలు పెద్దలు వారికి తెలిసిన అనేక ఔషధ మొక్కలను గురించి వివరించారు. యాత్రీకులు పర్వత ప్రాంతాల, లోయలలో లభించే వివిధ ఔషధ మొక్కలను వేరు చేసి, వాటి వివరాలు గ్రంథస్తం చేసే కార్యక్రమాన్ని 'సృష్టి' సంస్థ వారి పరిశోధనాలయానికి సిపారసు చేశారు. ఈ యాత్రలో అనేక మంది సాంప్రదాయ వైద్యులను కలవటం జరిగింది. ఉదాహరణకి : 'సాగ్యాంగ్' గ్రామంలో ఒక మూలికా వైద్యుడు ఏడు విభిన్న మూలికలను కలిపి 'సేంద్రియ క్రిమి సంహారక మందు'ను తయారు చేస్తున్నాడట. దీనిని 'సిక్కిం' ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పిస్తే బావుంటుంది అనిపించింది. అదేవిధంగా 'లింగ్ డాంగ్' గ్రామంలో నేపాలీ సాంప్రదాయ వైద్యుడు "ప్రీతిమాన్ చత్రీ" అనే అతను వివిధ జబ్బులకి స్థానికంగా వుండే మొక్కలతో వైద్యం చేస్తున్నాడట. ఆయనవద్ద వివిధ రుగ్మతలకని తయారు చేసిన 10 రకాల మందులు ఉన్నాయట. ఆయన ప్రత్యేకత 'ఎముకలకు సంబంధించి' తినటానికి, లేపనానికి ఇచ్చే ఔషధం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ ప్రాంతంలో సాంప్రదాయ వైద్యం ప్రచారంలో వుండటానికి ముఖ్య కారణం దట్టంగా ఉండే రక్షిత అటవీ ప్రాంతము కావటం ఒకటైతే, లెప్చాలు అడవినీ, ప్రకృతినీ వనదేవత రూపంలో పవిత్రంగా కొలవటం మరొకటి. ప్రభుత్వాధికారులు కూడా లెప్చాల ఈ సాంప్రదాయాన్ని ఎంతో గౌరవిస్తారు. లెప్చాలు తమ సాంస్కృతిక గేయాలలో ప్రకృతిపై తమకున్న భక్తి విశ్వాసాలను ప్రకటిస్తూ వుంటారు.

యాత్రీకులకి లెప్చాలు చేసుకునే సాంప్రదాయ వంటలు ఒక ప్రత్యేకతగా నిలిచిందనే చెప్పాలి. ప్రతి గ్రామంలో స్వయం సహాయక బృందాల మహిళలు యాత్రీకులకని ప్రత్యేకంగా చిరు ధాన్యాలు, పెండలం దుంప, ప్రత్యేకమైన గోధుమలు, రకరకాల దుంపలు, వేర్లతో చేసిన అనేక వంటకాల రుచి చూపించారు. ఇవన్నీ సేంద్రియ పద్ధతిలో పండించినవే. పుష్కలంగా బలవర్ధక పదార్థాల నుండి చాలా సందర్భాలలో ఔషధ గుణాలను కూడా కలిగి వుంటాయి. అక్రోట్ తో చేసిన టీ ని పంచదార కాకుండా ఉప్పు వేసుకుని త్రాగడం ఇక్కడి ప్రత్యేకత. దీనిలో సత్వరం శక్తినిచ్చే గుణం ఉండటమే కాకుండా, మధుమేహం వున్న వ్యక్తులకి మందుగా కూడా పని చేస్తుంది. ఆ ప్రాంత ప్రజలు చేసుకునే ప్రత్యేకమైన వంటకం 'ఖురి'. దీనిలో రకరకాల చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు వాడి, ప్రత్యేకమైన



మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.

పర్వదినాలలో చేసుకుంటూ వుంటారు. దుకాణాలలో ప్లాస్టిక్ వాడకుండా, సుగంధ ద్రవ్యాలు మొదలైనవి ప్రదర్శించ టానికి వెదురుతో చేసిన డబ్బాలాంటి వాటిని వాడుతూ వుంటారు. టీ కాఫీలు త్రాగడానికి కూడా అలాంటివే వాడుతారు. కొన్ని గ్రామాలలో తినే కంచాలు, వాడే చెంచాలు కూడా వెదురు, అరటితో చేసినవే. లెప్చాలు నివశించే జోంగు పర్వత ప్రాంతం నారింజ పళ్ళకి ప్రసిద్ధి. దేశంలోనే ఉత్తమమైన నారింజ మావద్ద దొరుకుతుంది అంటారు వాళ్ళు. శోధయాత్ర ప్రారంభమైన ఊరు 'లాంపా'. దానికా పేరు 'శాలాం' అంటే నారింజ నుంచి వచ్చింట. ఈ నారింజని సారాయి చేయటానికి, పచ్చళ్ళు, ఊరగాయలలు చేయటానికి లాంటి వివిధ రకాలుగా వాడుతూ వుంటారు. నిలువ ఉండే పచ్చళ్ళు చేసి (అక్రోట్ ఊరగాయ) షాపులలో వెదురు డబ్బాలలో అమ్ముతూ ఉంటారు.

ఈ ప్రాంతం వెదురుతో చేసిన అలంకార వస్తువులకు ప్రసిద్ధి. దాదాపు ప్రతి ఒక్కరికి ఈ పని తెలిసి వుంటుంది, దీన్ని చేతివృత్తిగా చేస్తూ వుంటారు. ఇప్పుడిప్పుడే పిల్లలు చదువులకని బయటి ప్రదేశాలకి వెళ్లిపోతున్నా, లెప్చాలలకి తమ సాంప్రదాయ వృత్తులు, కళలపై గౌరవం మక్కువగా ఉన్నది. ప్రతి గ్రామంలో స్త్రీ పురుషులు సాంప్రదాయ చేనేత వస్త్రాలనే విధిగా ధరిస్తారు. అతిథులని గౌరవించటానికి మనం కండువా వాడితే వారు అటువంటిదే 'ఖాడా' వాడుతారు. పురుషులు పైజామా లాల్చీలలాగా 'టోగ్రో, గ్యాథోర్' వాడుతారు. అదేవిధంగా స్త్రీలు 'దూవాన్, ఐశాన్' వాడుతారు. సాంప్రదాయంగా లెప్చాలు ఒక టోపీ





వాడుతారు. దీనికి చాలా ప్రత్యేకత ఉంది. దీనిని వెదురు లేదా కేన్ లతో తయారు చేస్తారు. దానిలో వుండే ప్రతి నగిషీకి ఒక అర్థం వుంటుంది. బాగా నగిషీలతో టోపీ తయారు చేయటానికి దాదాపు 3 నెలలు పడుతుంది. రూ. 15 వేల దాకా ఖరీదు కూడా వుంటుంది. దీనిని ప్రత్యేకించి పర్వదినాలలో, వేడుకలలో, పెళ్ళిళ్ళలో తప్పనిసరిగా వాడుతారు.

చాలా మంది లెప్చాలు బౌద్ధ మతస్తులు. దీనితో పాటు ప్రకృతిని ఆరాధిస్తూ 'బోంగ్ తిషింగిమ్' అనే పద్ధతిని కూడా అవలంభిస్తూ వుంటారు. ఈ పద్ధతిలోని రెండు పాత్రలను 'షామన్స్', 'మున్' అంటారు. చాలా గ్రామాల్లో లెప్చా సాంప్రదాయ పాటలను 'తుంగ్ దుప్' అనే వేణువు లాంటి పరికరం ఊదుతూ పాడుతుంటారు.

శుభ్రత అన్నది వీళ్ళ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. ఇళ్ళలో, ఇళ్ళ చుట్టూనే కాకుండా, మార్గ మధ్యంలో కూడా చెత్త డబ్బాలు ఉంటాయి. స్థానిక పంచాయితీలు ఈ విషయంలో చాలా శ్రద్ధ చూపిస్తారు. పాఠశాలలు, అంగన్ వాడీలు ఎంతో క్రమశిక్షణతో చక్కగా పని చేస్తున్నాయి. అక్కడ చదువు పూర్తయిన తర్వాత పై చదువులు చదువుకోవాలి అనుకునే వారికి సిక్కిం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది. స్థానికంగా ఉండే ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ పద్ధతి గురించి గర్వంగా చెపుతూ పై చదువులకని బైటకి వెళ్ళినవారు తిరిగి సిక్కింలో తమ సేవలను అందించటం లేదని వాపోయారు. అందుకేనేమో చాలామంది ప్రభుత్వాధికారులు, టీచర్లు బైట ప్రాంతం నుంచి వచ్చినవారిలా కనిపించారు. చాలా పాఠశాలల్లో మూడో వంతు మాత్రమే ఆడపిల్లలు ఉన్నట్లు అనిపించింది.

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**



కొన్నిచోట్ల మినహాయింపులుండవచ్చు. దీనికి మూడు ముఖ్య కారణాలున్నాయి. దాదాపు రెండు నుండి మూడు వందల మంది విద్యార్థులున్న పాఠశాలల్లో బాలికలకని కేవలం 5 మరుగు దొడ్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో చాలాభాగం పని చేయటం లేదు. అంతే కాక, చాలా పాఠశాలల్లో విద్యార్థినుల కొరకు ప్రత్యేకంగా వసతిగృహ ఏర్పాట్లు లేవు. ఉన్నా, చాలా తక్కువగా ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్య కారణం పాఠశాలలకి వెళ్ళే మార్గాలు దుర్గమంగా ఉంటున్నాయి. పాఠశాలలకి వెళ్ళటానికి ఇప్పుడిప్పుడే మంచి మార్గాలు ఏర్పాటు చేసే దిశలో ప్రయత్నాలు జరుగుతూ వున్నాయి. ఈ యాత్ర ప్రత్యేకత ఏమిటంటే, ఇంతకుముందు జరిగిన 33 శోధయాత్రల్లో కూడా ఏ ప్రభుత్వ ఉన్నతాధికారి పాల్గొనలేదు. కానీ ఈ 34వ శోధయాత్రలో మాత్రం స్థానిక ఉన్నతాధికారి శ్రీ ధోర్జీ యాత్ర మొత్తం మాతోనే ఉన్నాడు. దీనివలన అధికారులకి ఈ శోధయాత్ర వలన జరిగే లాభాలపై చాలా నమ్మకం కలిగినట్లు తెలుస్తోంది. యాత్రలో భాగంగా ఆ ప్రాంత పార్లమెంటు సభ్యులు శ్రీ పి.డి. రాయ్ (ఈయన ఐఐఎం, అహమ్మదాబాద్‌లో చదువుకున్నారు) రాష్ట్ర స్థాయి అధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, అనేక విషయాలు అడిగి తెలుసుకొని ఇంకా ఎన్నో మంచి విషయాలు ఆచరణలో పెట్టడానికి తగిన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడ్డారు. 'సాంగ్యాంగ్' గ్రామంలో జిల్లా స్థాయి పంచాయితీ అధికారి 'అంగోలీ లెప్చా' పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వచ్చి అక్కడ వున్న లెప్చాల చరిత్రను చాటే వస్తు ప్రదర్శన శాలని ఇంకా అభివృద్ధి చేయడానికి సహకరిస్తానని వాగ్దానం చేశాడు.

2013లో 'హి గైతాంగ్' గ్రామ పంచాయితీ వారు (ఇది జోగు నియోజక వర్గంలోకి వస్తుంది) ఉత్తర ప్రాంతంలో ఆగ్రామాన్ని మొదటిసారిగా 'మధ్యపాన నిషేధిత ప్రాంతం'గా ప్రకటించారట. ఈ మొత్తం ప్రాంతంలో సేంద్రియ వ్యవసాయం చేసే పద్ధతులు అందరికీ మార్గదర్శకంగా నిలవాలి ప్రత్యేకించి స్వయం సహాయక బృందాలు యీ పద్ధతికి ప్రాచుర్యం కల్పించటంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కాకపోతే పండించిన కాయగూరలు, పండ్ల విలువను పెంచటానికి తగిన సదుపాయాలు లేవు. అవి కల్పిస్తే మార్కెట్లో వీటికి మంచి ధర వచ్చి స్థానికుల ఆర్థిక స్థోమత పెరిగే అవకాశం మెండుగా వుంటుంది. ఇది గమనించిన 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' వారు స్థానిక గుంపల సహాయంతో యువత కొరకు గ్రామస్థాయి వ్యాపార కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించారు. లెప్చాలలో స్త్రీ పురుషుల మధ్య భేదాలు లేక ఇద్దరికీ సమానమైన హోదా కల్పింబడింది. వీరు తమ సాంప్రదాయాన్ని, ప్రకృతిని కాపాడుకుంటూ గర్వంగా ప్రదర్శిస్తూ వుంటారు. ఇది గమనించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక పరిశోధనా విద్యార్థి వీరిజీవన శైలిపైన ఒక పరిశోధనా గ్రంథం వ్రాస్తున్నారట.

దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న గ్రామస్థాయి లోని సృజనాత్మకతను, ఇన్నోవేషన్‌లను, వారి సాంప్రదాయ జ్ఞానాన్ని వెలికి తీసి, నలుగురికీ తెలియజేయాలి అనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నవే ఈ శోదయాత్రలు. ఉత్తర సిక్కిం ప్రాంతంలో నిర్వహించిన ఈ 34వ శోధయాత్ర చాలా సంతృప్తిని ఇచ్చిందనే చెప్పాలి. సాంస్కృతికంగా ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రాంతం గురించి నలుగురికీ తెలియజేసినందుకు ఈ శోధయాత్ర సఫలీకృతమైందని భావిస్తున్నాం. ●



**కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

### స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

## జాతీయ 10వ ద్వైవార్షిక పోటీలు

### పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 10వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2017** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**


**National Innovation Foundation-India, Satellite Complex,**
**Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org,**
**Website: www.nif.org.in**


**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ **http://www.nif.org.in/announcement**.చూడండి.

# 'పల్లెసృజన'కు సర్వదా కృతజ్ఞులం - సుభాని సోదరులు

'బూమ్ స్ప్రేయర్' తో "లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్"లో పేరు నమోదు చేయించుకున్న గుంటూరు జిల్లా 'భైరువాని పాలెం' నివాసి "సయ్యద్ సుభాని" పల్లెసృజన పాఠకులకు చిరపరిచితుడే. 'పల్లెసృజన' పరిచయం కాకముందు, పరిచయం తర్వాత సుభాని గురించి తెలియజేయాలన్నదే మా ఉద్దేశ్యం. ఈ విషయమై ఆయనను పల్లెసృజన ఇటీవల కలువగా ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను మీముందు ఉంచుతున్నాం.

పల్లెసృజన ఇటీవల సుభానిని సంస్థ పరిచయం అయిన తరువాత మీ అభిప్రాయాలను తెలియజేయమని అడుగగా, "గల్లీలో కూడా అంతగా పరిచయం, ప్రాచుర్యం లేని నన్ను "ఢిల్లీ" దాకా తీసుకువెళ్ళిన 'పల్లెసృజన'న నా జీవితంలో మరపురాయి మైలురాయి" అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. పల్లెసృజన పరిచయం కాకపోయి వుంటే నా పనితనం ద్వారా మహా అయితే మండల స్థాయి వరకు పరిచయం అయ్యేదేమో కానీ, పల్లెసృజన పరిచయం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా నా పేరు తెలియజేసినందుకు తన కృతజ్ఞతలను తెలియజేశాడు. ప్రపంచంలోని కొన్ని ఇతర దేశాల నుంచి కూడా నాకు ఫోన్లు రావడం పల్లెసృజన వల్లే సాధ్యమైంది కదా అన్నారాయన.



సుభాని పల్లెసృజనతో తన అనుబంధాన్ని గురించి తెలియజేస్తూ "2007వ సంవత్సరంలో మా అల్లుడు 'పటాన్ సైదా' ద్వారా 'పల్లెసృజన'తో పరిచయం ఏర్పడింది. మా మొట్ట మొదటి కలయికలో 'కారంచేడు' రైతు సదస్సులో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారితో పరిచయం కావడం నన్నెంతో ఉద్వేగానికి గురి చేసింది. ఆ తర్వాత నాబార్డు వారు రూ. 2 లక్షలకు పైగా ఆర్థిక సహాయం చేయటం, 'లిమ్కాబుక్'లో నా పేరు నమోదు కావటంతో ఆ సంస్థ సిజియం మోహనయ్య గారు నన్ను సన్మానించడం... ఇవన్నీ పల్లెసృజన వల్ల నాకు కలిగిన భాగ్యాలే... ఒక గల్లీలో మామూలు స్ప్రేయర్ మెకానిక్‌ను అయిన నేను నాకున్న సృజనాత్మకతతో స్ప్రేయర్లను అభివృద్ధి చేసుకుంటూ వుండేవాడిని అలాంటి నాకు పల్లెసృజన ద్వారా మొట్టమొదటిసారి ముఖ్యమంత్రిని కలవడం, ఆ తర్వాత ఢిల్లీలో రాష్ట్రపతిని కలవటం దాకా తీసుకు వెళ్ళిందంటే ఒక సాధారణ గ్రామీణుడికి ఇంతకన్నా ఏమి కావాలి?" అన్నారాయన.

స్వతహాగా సృజనాత్మక స్ప్రేయర్ మెకానిక్ అయిన సుభాని మొట్టమొదటి సారిగా ఒక సైకిలు చక్రానికి 50 అడుగుల వెడల్పులో ఇద్దరు మనుషులు లాగితే పొలంలో పురుగు మందును పిచికారి చేసే పరికరాన్ని తయారు చేశాడు. అప్పట్లో అది ఆ గ్రామ రైతులకు పురుగు మందు చల్లేందుకు అయ్యే ఖర్చులను మిగిల్చడంతో అతన్ని ఆ గ్రామ రైతులందరూ అభినందించారు.

ఆ తర్వాత మామూలు స్ప్రేయర్లకే సమర్థత పెరిగేలా తన సృజనాత్మకతతో మెరుగులు దిద్దటం మొదలు పెట్టాడు. మామూలుగా ట్రాక్టర్ అనుసంధానమైన స్ప్రేయర్‌కు మెరుగులు దిద్ది ఎక్కువ విస్తీర్ణంలో మందును పిచికారి చేయటంలో కృతకృత్యుడు అయ్యాడు. అప్పట్లో అదో వింతగా రైతాంగం చూడటంతో దాన్ని పల్లెసృజన సహకారంతో 'బూమ్ స్ప్రేయర్'ను 'లిమ్కా బుక్ ఆఫ్

**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**

రికార్డ్'లో నమోదు కావడం జరిగింది. ఆ తర్వాత నాబార్డ్ సహకారం, రాష్ట్రపతి అవార్డులతో తాను ఎన్నడూ కలగనని ప్రపంచాన్ని పల్లెసృజన పరిచయం చేయటంతో తన ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

సుభాని ప్రత్యేకత ఏమిటంటే తాను ఒక గదిలో కూర్చుని తనకు తోచిన ఆలోచనలతో స్ప్రేయర్లను తయారు చేయటం కాదు. నేరుగా రైతు వద్దకే వెళ్ళి అతని అవసరానికి తగ్గట్టుగా, పురుగు మందు పిచికారీలో వీలైనంత వరకు కూలీల ఖర్చును తగ్గించేలా, సమర్ధవంతంగా స్ప్రేయర్లను తయారు చేయటం ఇతని ప్రత్యేకత. ఈ ప్రత్యేకత తోనే నాడు స్ప్రేయర్లను రిపేరు చేసే సుభానిని నేడు స్ప్రేయర్లను తయారు చేసి మార్కెట్‌లో విక్రయించే స్థాయికి చేర్చింది.

ఈ క్రమంలో ప్రభుత్వం వారి 'ప్రోత్సాహక రైతు' పురస్కారం, నాబార్డు పురస్కారం, లిమ్కా రికార్డులో నమోదు కూడా స్వంతం చేసుకున్నాడు. ఈ పురస్కారాల తర్వాత తన స్వగ్రామమైన 'భైరవవాని పాలెం' గ్రామంలో స్ప్రేయర్ల రిపేరు చేసే సుభాని కాస్తా "లిమ్కా సుభాని" గా అతని పేరు మారిందంటే ఇక అతని ఆనందం ఎలా వుంటుందో పాఠకులు ఊహించుకోగలరు. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రైతాంగానికి ఏదైనా కొత్త రకం స్ప్రేయర్ వుంటే బావుంటుంది అనుకుంటే వెంటనే 'పల్లెసృజన' పరిచయస్తుల కు గుర్తుకు వచ్చే పేరు 'సుభాని'. ఈమధ్యనే విజయవాడకు చెందిన హన్మంత రెడ్డి అనే ఒక పల్లెసృజన అభిమాని ద్వారా సుభానికి మరో సరికొత్త స్ప్రేయర్‌ను తయారు చేసే అవకాశం వచ్చింది. ఇంతవరకు 'పవర్ టిల్లర్'కు బూమ్ స్ప్రేయర్‌ను ఎవ్వరూ తయారు చేసి అమర్చ లేదు. 35 అడుగుల వెడల్పులో పురుగు మందును పిచికారి చేసే సామర్థ్యం గల ఈ స్ప్రేయర్ కూడా రైతాంగానికి అందుబాటులోకి తెచ్చాడు. సుభాని ప్రత్యేకత ఏమిటంటే ఎవరైనా రైతు తన పురుగు మందు పిచికారి సమస్యను వివరిస్తే ఆ రైతుకు తగ్గట్టుగా స్ప్రేయర్ తయారు చేసి ఇవ్వగలగటం.

తనకు అత్యంత సహకారం, ప్రోత్సాహం అందించి నవారు సన్నకారు రైతులేనని ఆనందంగా అంటాడు సుభాని.



ఎందుకంటే సన్నకారు రైతులకు ఖర్చు, సమయాన్ని ఆదా చేయటంలో సుభాని స్ప్రేయర్లు ఎంతో సహకరించాయి. కాని తనకు ఆర్థికంగా పరిపుష్టిని అందిస్తున్నది మాత్రం పెద్ద రైతులే అని తన మనోభావాన్ని వ్యక్తం చేశాడు. వారి సహకారంతోనే నేడు తాను ఆర్థికంగా ఎదగడంతో పాటు, సమాజంలో ఒక మంచి పేరు సంపాదించుకో గలిగాను అంటారాయన. అప్పట్లో స్ప్రేయర్ల రిపేరు కూడా బాగా తగ్గుముఖం పట్టిందని, ఇక తాను వేరే పట్టణానికి వలస వెళ్ళక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. పట్టణానికి వలస వెళ్ళాలన్న ఆలోచన ఆపివేయటంతో పాటు, తన గ్రామంలోనే తనకు మంచి పేరు ప్రఖ్యాతులను ఆర్జించి పెట్టిందన్నారు. ప్రస్తుతం తాను తన గ్రామంలోనే వుంటూ నెలకు 15 నుండి 20 వేల రూపాయలను ఆర్జించే స్థాయికి చేర్చిన పల్లెసృజనను, ఆ సంస్థ సభ్యులను జీవితంలో మరువలేను అన్నారు. తాను చేస్తున్న పనిలో తన సోదరుడు మరియు తన భార్య 'షకీలా'ల సహకారం తనకు ఎల్లప్పుడూ లభించడం తనకెంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. సుభాని భార్య షకీలా 'పల్లెసృజన' తో మాట్లాడుతూ "మా గ్రామంలోనే మాకు మంచి పేరు ప్రఖ్యాతులను, ఆర్థిక పరిపుష్టిని ఆర్జించి పెట్టిన పల్లెసృజనకు మేమెప్పుడూ కృతజ్ఞులమై వుంటామన్నారు.

తనకు ఇంతటి పేరు ప్రఖ్యాతులను ఆర్జించి పెట్టినందుకు మా మండలంలోని ప్రతి గ్రామానికి 'పల్లెసృజన పత్రిక' చేర్చడం నా బాధ్యతగా భావిస్తున్నాను అన్నారు.

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

## స్పందన

**బ్రిగేడియర్ గారికి,**

నేను గత 18 సంవత్సరాల నుండి అమెరికాలో ఉంటూ కూడా మీ గురించి, మీ కార్యక్రమాలను గురించి మీ ఇ-మెయిల్‌ల ద్వారా తెలుసుకుంటున్నాను. మీరు ఉత్సాహంగా ఈ ప్రపంచానికి చేస్తున్న సేవ నన్ను ముగ్ధుడ్ని చేసింది. ఈ ఇ-మెయిల్ ప్రతిని భారతదేశంలో వున్న 'సూరం మల్లికార్జున శర్మ' గారికి కూడా పంపుతున్నాను. ఆయన గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పేరెన్నిక గల వ్యక్తులతో పనిచేయటమే కాక, నెల్లూరు నుండి వెలువడే 'జమీన్ రైతు' పత్రికకి విలేకరిగా పనిచేసిన అనుభవం గల వ్యక్తి. మీరు దయచేసి మీ వివరాలు, మీ కార్యక్రమాలు, మీ వెబ్ పేజ్ పంపితే మేము కూడా మీకు మావంతు సహాయం అందించాలనుకుంటున్నాము. **– ఇన్నమూరి చక్రపాణి,** అమెరికా.

**చక్రపాణి గారికి,**

'పల్లెసృజన' శుభాకాంక్షలు. అమెరికాలో వుంటూ కూడా మా కార్యక్రమాలను గురించి ఉత్సుకతతో తెలుసుకుంటున్నందుకు ధన్యవాదాలు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో మేం చేస్తున్న కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు పల్లెసృజన వెబ్‌సైట్ www.pallesrujana.org ద్వారా తెలుసుకోవచ్చు. మల్లికార్జున శర్మ గారిని పరిచయం చేసినందుకు ధన్యవాదాలు. మీ ఇరువురికి పల్లెసృజన కార్యాలయాన్ని దర్శించటానికి ఎప్పుడూ మా ఆహ్వానం ఉంటుంది. మీరు హైదరాబాద్ ఎప్పుడు వస్తారో తెలుపగలరు. సమాజానికి సేవ చేయాలనే ఆలోచన వున్న మన సంబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను.

**– బ్రిగేడియర్ గణేశం**

**బ్రిగేడియర్ గారికి,** నేను నాగపూర్ లోని విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్ చదువుతూ మా సంస్థ సాంఘిక కార్యక్రమాలు చేపట్టే 'ప్రయాస్'లో సభ్యురాలిగా వున్నాను. మీరు మా కళాశాలలో మాట్లాడిన ఒక సెమినార్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు ఎండాకాలం సెలవుల్లో మీ సంస్థలో ఇన్‌టర్న్‌గా చేరి మీ కార్యక్రమాలను గురించి తెలుసుకుంటూ, మీ సంస్థతో కలిం పని చేయాలని కోరుకుంటున్నాను. నా వివరాలు జతచేస్తున్నాను. అతి త్వరలో మీ నిర్ణయం చెప్పగలరని ఆశిస్తున్నాను. **– పోకూరి సుమజ, నవీన్.**

**సుమజ, నవీన్ గార్లకు,**

'పల్లెసృజన'లో ఇన్‌టర్న్‌గా చేరటానికి మీకు స్వాగతం. వివరాలు నాకు ఫోన్ చేస్తే తెలియజేస్తాను. (ప్రస్తుతం సుమజ, సుమన్ ఇద్దరూ 'పల్లెసృజన'లో ఇన్‌టర్న్‌గా చేరి 'పల్లెసృజన' కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నారు). **– బ్రిగేడియర్ గణేశం.**


### FORM IV

### PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher


ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు

## తులసి

పంటల ఎదుగుదలకు,
వైరస్ నివారణకు
సేంద్రియ మందు




## పర్‌ఫెక్ట్

వరిలో సుడిదోమ
పత్తి, మిరప, ఇతర కూరగాయ
పంటలను ఆశించే రసం పీల్చే పురుగు,
తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి
మొదలైన వాటిని
సమర్థవంతంగా నివారిస్తుంది




సృష్టి
## కృషక్

పంటల
ఎదుగుదలకు,
ఆకుముడత తెగులు
నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## సుదర్శన్

పంటల
ఎదుగుదలకు,
కూరగాయల పంటలలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## సర్వత్ర

పంటల ఎదుగుదలకు,
రసం పీల్చే పురుగు
నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## ప్రహార్

పంటల ఎదుగుదలకు,
పిండినల్లి
నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## ప్రయాస్

పంటల ఎదుగుదలకు,
పూత రాలుట
నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## శక్తి

పంటల ఎదుగుదలకు
సేంద్రియ మందు



సృష్టి
## శస్త్ర

పంటల ఎదుగుదలకు,
తామర పురుగు, తెల్లదోమ,
శనగపచ్చ పురుగుల
నివారణకు సేంద్రియ మందు



సృష్టి
## కె&సి

పంటల ఎదుగుదలకు,
బ్యాక్టీరియా, ఫంగస్
నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## సురక్ష

పంటల ఎదుగుదలకు,
చెదల నివారణకు
సేంద్రియ మందు



సృష్టి
## రక్షక్

పంటల ఎదుగుదలకు,
పత్తి పంటలో
పురుగుల నివారణకు
ంంద్రియ మందు



పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం
**'కుంటా' వ్యాధి మందు**
(నరాల బలహీనతతో కాళ్ళు చచ్చుపడిపోవడం)



2 వెల్లిపాయలు, 20 మిరియాలు పొడిలో కలిపి నూరి వేడినీటిలో కలిపి ఒకరోజు ఉదయం మరియు సాయంత్రం పశువుకు త్రాగించాలి.
ఈ ప్యాకెట్‌లోని మందు ఒకరోజు పశువుకు త్రాగించడానికి ఉపయోగ పడుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి
**క్రియేటివ్ మైండ్స్**
ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

పశువైద్యంలో పేరెన్నికగన్న
అనంతపురం జిల్లా వాసి
బోయ పెద్దరాజన్న
తయారు చేసిన
పశువుల మందులు

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం
**'పొదుగువాపు' వ్యాధి మందు**



ప్యాకెట్‌లోని సగం పొడిని
వేడినీటిలో కలిపి
వాచిన పొదుగుకు పట్టించాలి.
రెండురోజులు వరుసగా
పొదుగుకు పట్టించినచో
పొదుగు మామూలుగా మారి
పాలు పితకడానికి వీలవుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి
**క్రియేటివ్ మైండ్స్**
ఫోన్ : 040-ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

కావలసిన వారు సంప్రదించవలసిన చిరునామా :

**క్రియేటివ్ మైండ్స్**, ఇంటి నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500094.
ఫోన్ : **040-27111959**, మొబైల్ : **8498908182**


PALLESRUJANA Telugu Bi-monthly 20/- May-June- 2016 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?


ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



























### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904